Reg. No. 1118. దినపత్రికగా.

ఆంధ్రపత్రిక

Founder : K. NAGESWARA RAO Editor : S. SAMBHU PRASAD

Vol. 29. Andhra Patrika Madras, Tuesday, 9-3-43 No. 298

భారత అసెంబ్లీ:

అడ్వైజరుల 'సలహాలు'

—(:)—

పత్రికలపట్ల ప్రభుత్వం వైఖరిగూర్చి విమర్శలు

న్యూ ఢిల్లీ, మార్చి 8:—

నేడు భారత అసెంబ్లీసభలో శ్రీ టి. టి. కృష్ణమాచారిగారు పత్రికల ఎడ ప్రభుత్వము గనపరచుచున్న వైఖరి, పత్రికలపై నిర్బంధాలను గూర్చి కోత తీర్మానంతెస్తూ 1940 నవంబరులో పత్రికలకు ప్రభుత్వానికి జరిగిన ఒడంబడిక చరిత్రను తెలిపిన అనంతరం ఇట్లా చెప్పారు. "సదరు ఒడంబడికను ఆచరణలో నుంచటానికి రాష్ట్రప్రభుత్వాలు సామాన్యంగా అయిష్టతను కనపరుస్తున్నట్లుంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజాప్రతినిధుల ప్రభుత్వాలు లేవన్నసంగతి ప్రభుత్వానికి తెలిసిందే. దేశమంతటా బహిరంగసభలు నిషేధింపబడుతున్నవి. ఇట్టి సందర్భాల్లో ప్రభుత్వానికి తమ కష్టాలను దేలుపుకొని నివారించుకోవటానికి ప్రజలకు పత్రికలే ముఖ్యసాధనమై యున్నవి. పత్రికలు సలహాఇస్తామని చెప్పికొన్ని తరహాలవార్తలు పత్రికల్లో బయట పడకుండా ప్రభుత్వం గట్టిగా అణగద్రొక్కగలుగుచున్నారు. ఇది స్వచ్ఛంద మేనని అంటూ లేమమాటను వినని వారిని దండిస్తున్నారు. వ్రాతపూర్వకంగా గాక ఒక్కొక్కతరి టెలిఫోనుపై పత్రికల సలహా దార్లు సూచన లిచ్చుచుందురు. వీటికి తోడు గత మేలో పత్రికలపై మరికొన్ని నిర్బంధాలను దొర్లించారు. ఏతావతా పత్రికల కంట్రోలు రాష్ట్రాధికార్ల చిత్తవృత్తులకు వదలివేయక కేంద్రప్రభుత్వం ఒకరీతిన నడపటం యుక్తం.

మాక్స్‌వెల్ గారి అభయం

సర్ జెజాబ్జీ మాక్సువెల్ గారు కృష్ణమాచారిగారి చతురతనూ వాదనను ప్రశంసిస్తూ ఇట్లా చెప్పారు. 1940 నుంచీ నేనెన్నో కష్టపడి గట్టిగా కృషిచేశానంటే పత్రికలకూ ప్రభుత్వానికి సన్నిహిత సంబంధాన్ని పెంపొందించటానికి శాయశక్తులా ప్రయత్నించటమే. నేనీవిషయంలో సఫలనయ్యానని గూడా నమ్మకం. రాష్ట్రప్రభుత్వాలకు పత్రికలవారి కష్టనిష్ఠురాలను చెప్పితరచు వారికి నచ్చజెప్ప గలిగాను గూడాను.

రాష్ట్రప్రభుత్వాల అధికారం

వార్తాపత్రికలూ, ప్రెస్సూ సమష్టి జాబితాలోనివనీ అందువల్ల సమూలంగా రాష్ట్రాధికారుల హస్తాల్లోంచి అధికారాన్ని ఈసందర్భంలో లాగివెయ్యటానికి వీలులేదని సభవారికి విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్రానికి రాష్ట్రానికి పరిస్థితులు వేరు. మంత్రివర్గాలు పనిచేస్తున్నచోట్ల వాళ్ళకి గట్టిగా చెప్పటం కష్టం. అఖిల భారతపనికి సంబంధించిన విషయాల్లో భారత ప్రభుత్వం వారొక పంథాపై ఉత్తర్వులిస్తే రాష్ట్రాల్లో విపరాలు సంభవింపబడుతయి. అవిగూడా పత్రికలవారితో చర్చించి వారిఒప్పుదలపై జరపాలని గూడా ప్రభుత్వం గట్టిగా చెప్పేఉన్నారు.

సంపాదకీయాలపట్ల నిర్బంధాలు లేవు. భారతదేశశ్రేయానికి భంగం వాటిల్లేట్లు ఎవరన్నా వ్రాశారంటే ఆపత్రికపై చర్యతీసికొనబడుతోంది. హిందూస్తాన్ టైమ్సునుండి తగిన సహకారం రాకపోవటం విచారకరం ఇంగ్లీషు పత్రికల్లో పడ్డ వార్తలు దేశభాషా పత్రికల్లో పడటానికైనా అభ్యంతరాలు ఉండినట్లేమో విచారిస్తాను. టెలిఫోనుపై సూచన లేమైన ఇవ్వబడుచున్న వేమో నాకు తెలియదు. అక్టోబరు 2 వ తేదీన పత్రికా సంపాదకులు గావించిన తీర్మానాన్ని ప్రభుత్వం జెంటనే పాటించారు అన్ని రాష్ట్రాలుగూడ అంగీకరించినవి. ఇందులో వాగ్దానభంగం ఏమీరాలేదు. అవతలవారు సహకారం చేసినంతవరకూ ప్రభుత్వం హామీనిస్తూ ప్రత్యుపకారంచేస్తూనే ఉంటాయి.

ఆనారిగారి కోతతీర్మానం డివిజను లేకుండానే వీగిపోయింది.

నాయకుల ఇష్టాగోష్ఠి

—(:)—

సావర్కరుగారు కూడ పాల్గొనవచ్చును

బొంబాయి, మార్చి 8:—

రేపు బొంబాయిలో జరుగనున్న నాయకుల ఇష్టాగోష్ఠి సభలో పాల్గొనుటకు సర్ తేజబహదరు సప్రూగారు నేడు బొంబాయి వచ్చిరి.

భారత ఆకాలీసిక్కుల నాయకుడు మాస్టరు తారాసింగుగారు నిన్న రాత్రి అమృతసరునుండి బొంబాయికి బయలుదేరిరి.

భారత అజాదు ముస్లింపార్టీ అధ్యక్షుడును సింధు మాజీప్రధానమంత్రియు నయిన అల్లాబక్షుగారు షికారుపూరునుండి నిన్నను కరాచీవచ్చిరి. వీరు రేపు విమానమువేయి బొంబాయి వెళతారు. సావర్కరుగారు కూడా యీ సభకు వచ్చుటకు కొందరు గట్టి ప్రయత్నమును చేయుచున్నారు. నేడు సాయంకాలము యిద్దరు నాయకులు సావర్కరుగారి యింటికివెళ్లి వారితో చాలాసేపు మాటలాడిరి.

ముస్లింలీగువారి నిచ్ఛాభిప్రాయమును కూడా యిప్పుడే తెలుసుకొనవలెనని బొంబాయి వచ్చిన నాయకులలో కొందరు తెలిపిరి. ఇది వెల్లడియైనచో యిదివరకు దీని నామోదించకుండనున్న సిక్కులు మొదలైన పక్షములవారుకూడా దీని నామోదించుటకు ప్రయత్నముచేయబడును. సర్ ఎ. హెచ్. ఘజనవీగారు యిదివరకే వక సంఘమునకు వాగ్దానముచేసినందున వారి సభకు రాజాలరు. సావర్కరు, మూంజీగార్లు మొదలైన మహాసభనాయకులును బొంబాయి వాస్తవ్యులైన మోదీ, దలాలు, తాతా, బిర్లా, భూలాభాయి గార్లును సభకు వస్తారని తెలియుచున్నది. అల్లాబక్షుగారును ఆనీ గారును రేపు బొంబాయి చేరెదరు.

సి. రాజగోపాలాచారిగారు మదరాసునుండి యెల్లుండి 10 వ తేదీని బొంబాయి వచ్చెద రని తెలిసినది.

శరత్‌బోసు కోరిక నిరాకరణ

కలకత్తా, మార్చి 8:—

నేడు బెంగాలు ఎసెంబ్లీలో ప్రధాన మంత్రి ఫజులుల్ హక్కుగారొక ప్రశ్నకు సమాధానమిస్తూ, శరత్‌చంద్రబోసుగారు తమ మామగారి శ్రాద్ధకర్మకై పెరోలుపై విడదలిపెట్టవలసిందిగా భారత ప్రభుత్వంవారికి తెలియజేసుకున్న విషయంలో బెంగాలు ప్రభుత్వంవారు జోక్యం కలగజేసుకోటానికి అశక్తులై వున్నారని చెప్పారు.

ధరల అలవెన్సు సందర్భాన జమ్నాదాసు మెహతాగారు తెచ్చిన తీర్మానాన్నిగూడా సభవారు డివిజను లేకుండానే నిరాకరించారు. సభ నాటికి ముగిసింది.

హోమెంబరు వైఖరి మార్పు

ఢిల్లీ, మార్చి 8:—

పత్రికలపై నిర్బంధముల గూర్చి నేడు అసెంబ్లీలో శ్రీ టి. టి. కృష్ణమాచారిగారు ప్రతిపాదించిన కోతతీర్మానమునకు బదులు చెప్పుచు మాక్సువెలుగారు నేడు చాల సరసముగ మాటలాడుట అందరికి ఆశ్చర్యంగా నుంది. ఇపుడు పరిస్థితులు మొత్తంపై సంతృప్తికరంగా నున్నవనియు, వీలయినంతవరకు పత్రికలు తమంత తామే నిర్బంధాలకు అంగీకరించుట మంచిదని ప్రభుత్వంవారు తలంచిరనియు, సంపాదకీయ వ్యాసములపై నిర్బంధము లుంచక, అవసరమయినపుడు కొన్ని తరగతుల వార్తల ప్రచురణపైనే కొంత నిర్బంధము లుంచబడిననియు మాక్సువెలుగారు తెలిపిరి.

ఆనీ, సర్కారు, మోదీగారు రాజీనామా నిచ్చినపుడు వారి బొమ్మలు ప్రకటింపరాదని హిందూస్థానుటైమ్సు పత్రికను శాసించిన కృష్ణమాచారిగారనగా, అట్లా జరిగియుండే అది చాల ఆశ్చర్యమేనని మాక్సువెలుగారనిరి. (మా ప్రత్యేకవిలేఖరి)

అల్లరుల గూర్చి గాంధి మహాత్ముని లేఖ

—(:)—

రాజప్రతినిధి ఇంతకాలం దాచియుంచడం అనుచితము

—సి. ఆర్.

మదరాసు, మార్చి 8:—

సి. రాజగోపాలాచారిగారు నేడిటుల వక ప్రకటన గావించిరి: —

"గాంధిమహాత్మునకును తనకును జరిగిన లేఖలను రాజప్రతినిధి గతనెల 10వ తేదీని ప్రకటించిరి. ఈ లేఖలవలన ముఖ్యతమమైన వక అంశము వెల్లడియైనది. ఇది అప్పటినుండియును అధికమైన కలవరమును కలిగించుచున్నది. బొంబాయి అరెస్టుల అనంతరం దేశము నందంతటను దౌర్జన్యకరములైన కృత్యములను నిర్మూలన కార్యములను ప్రారంభమైనవి. వీటి నన్నిటిని పూర్తిగా నిరసించుచు గాంధి మహాత్ముడు 1942 సెప్టెంబరునెల 23 వ తేదీనే పూనాలో ఆగాఖాను మందిరమునుండి రాజప్రతినిధికి వ్రాసెను. ఈ ఉత్తరమును పూర్తిగాగాని దీనిలోని విషయముల నన్నిటిని అయినను గాని వెంటనే రాజప్రతినిధి ప్రకటించియుండిన యడల అంతటితోనే యీ అల్లరులన్నియును అడగిపోయియుండును. ఇటువంటి దుష్కృత్యములను చేయుచున్నవారును, వీటిని చేయునట్లు ప్రజలను ప్రోత్సాహపరుచుచున్నవారును గాంధిమహాత్ముడుగాని భారతకాంగ్రెసు సంఘమువారుగాని ఈ దౌర్జన్యచర్యలు అమోదించిరని చెప్పుటకు సాహసించియుండరు. నిరోధవిధానమువట్ల ప్రభుత్వనిశ్చయం

"దేశములో అల్లరులను తాము అడచివేయగలుగుచున్నామన్న ధైర్యము దొరతనమువారికి కలిగినందువలన వారు తమ కఠినవిధానమును కొనసాగించుటకే నిశ్చయించిరి. గాంధిమహాత్ముని లేఖను వెంటనే ప్రకటించుట తమ ముఖ్య బాధ్యతయని వారు గుర్తించలేదు. దొరతనమువారి లేఖను ప్రకటించకపోవుటకి దేకారణమునుపూహించవలసివచ్చుచున్నది. వారిలేఖను ప్రకటించక పోవుటవలన యీ దుష్కృత్యములను మహాత్ముడు నిరసించెన్నవార్త ప్రజల కెవ్వరికినికూడా తెలియలేదు. అందువలన దేశములో వినాశకరములను దౌర్జన్యకృత్యము లాకవైపునను దొరతనమువారి కఠినవిధానము మరొకవైపునను జరుగుచునే యుండెను. దీనికి దొరతనమువారంగీకరించిరని చెప్పక తప్పదు.

"ఇట్టి దుష్కార్యములను చేయవలెనని యును రహస్యసంఘముల నేర్పరచవలెనని యును మహాత్ముడెన్నడును సూచించియుండడు." అనే గట్టి నమ్మకము దేశీయులలో చాల మందికి కలదు. దేశములో కఠినవిధానము కొనసాగుచున్నందుకు వీరందరును చాలా విచారమును వెందుచుండిరి. 1942 సెప్టెంబరు 23 వ తేదీని మహాత్ముడు రాజప్రతినిధికి వ్రాసిన లేఖను రాజప్రతినిధి బట్టబయలు చేసియుండగూడదు. అని ఆక్షేపించుటకు వీరికందరికిని హక్కుకలదు.

రాజప్రతినిధి విపరీత వైఖరి

1942 నవంబరు నెలలో నేను రాజప్రతినిధితో మాట్లాడితిని. "గాంధిగారికి అధికారులు ప్రతిదినము వార్తాపత్రికల నన్నిటిని యిచ్చుచుండినను దేశములో జరుగుచున్న దౌర్జన్య నిర్మూలన కార్యములను నిరసించుచు గాంధిగారి రిప్పటివరకును ఒక్క లేఖనైనను వ్రాసియుండలేదు." అని రాజప్రతినిధి నవంబరునెలలో నాతో చెప్పెను. 1942 సెప్టెంబరునెలలోనే మహాత్ముని లేఖ రాజప్రతినిధికి చేరినప్పటికిని నవంబరునెలలో రాజప్రతినిధి నాతో యిటుల చెప్పుట ఆశ్చర్యకరముకాదా?

గాంధిమహాత్మునితో మాటలాడుటకు నా కనుమతి నియ్యవలెనని నేనపుడు రాజప్రతినిధిని కోరితిని. అటుల అనుమతి నిచ్చుటకు వీలులేదని రాజప్రతినిధి నాతో నప్పుడు నిష్కర్షగా చెప్పెను. రాజప్రతినిధి నాకోరిక మతిరస్కరించినప్పుటు అనగా నవంబరునెల 12 వ తేదీని ఢిల్లీలో విలేఖరులసభలో నేనిటుల తెలిపితిని. "మహాత్మునితో నేను మాటలాడుటవలన యిపుడు దేశములో అల్లరులను చేయుచున్నవారికి నేనధికమైన ప్రోత్సాహమును కలుగజేసిన వాడ ననుచునని వారు తోచియుండినయెడల మహాత్ముని చూచుటకు నేననుమతిని కోరియేయుండెను. నాఅభిప్రాయమును నేను మిక్కిలి స్పష్టముగానే తెలిపియున్నాను. ఆవి దేశీయులకందరికినికూడా బాగుగా తెలిసియున్నవి.

(3-వ పేజి చూడుడు)

ఏ నాగరిక దేశంలోను కని విని ఎరుగము

—(*)—

ప్రభుత్వ నిర్బంధ విధానము—భారత అసెంబ్లీలో విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 8:—

భారత ఎసెంబ్లీలో నేడు కోతతీర్మానములపై చర్చ జరిగెను. ప్రభుత్వమువారి నిర్బంధవిధానమును చర్చించుటకు గాను సర్దార్ శాంతసింగుగారు ప్రతిపాదించిన తీర్మానమును సభవారు వోటులేకుండ నిరాకరించిరి.

భీతావహము కలిగించువద్ధతులు

సర్దార్ శాంతసింగుగారు ప్రతిపాదన గావించుచు యిట్లు చెప్పిరి:— ప్రభుత్వమువారు ప్రజలలో భీతావహము కలిగించువద్ధతుల నవలంబించుచున్నారు. ప్రజల స్వేచ్ఛ నిర్దయాత్మకముగా నడచివేయబడుచున్నది. ఈ అత్యాచారములను యే నాగరిక ప్రభుత్వము చేయదు. ఇంగ్లండు, అమెరికాలలో యిట్టిపద్ధతుల నవలంబింపవీలునా?

హోంమెంబరు:— అచ్చట కాంగ్రెస్ వారులు లేరు.

శాంతసింగు:— నిద్రలో సైతము కాంగ్రెస్ వాదులాడుదును పెన్నాడుచున్నారు. మరియొక జన్మంలోగూడ బహుశః కాంగ్రెస్ వాదులాయనను వెన్నాడుచుందురు. (నవ్వు) 7 నెలలైనతరువాత గూడ ప్రభుత్వం వారి పద్ధతులు విజయవంతము కాకపోయెను. దేశములో ప్రతిష్టంభన యేర్పడెను. రాజప్రతినిధి కార్యవర్గ సభ్యులు ముగ్గురు రాజీనామా నిచ్చిరి. ప్రపంచాభిప్రాయము ఇండియా ప్రభుత్వమునకు వ్యతిరేకముగా నుండెను. నాగరక పద్ధతుల నవలంబించుచో మేము మీకు తోడ్పడెదము. అనాగరిక పద్ధతుల నవలంబించుచో మేము తోడ్పడము.

ఎన్నాళ్లు ఈ పేనుగులాట

ఈ పేనుగులాట ఎన్నాళ్లుజరుగును? ఊరేగింపు చేసినందుకు బాలికలను సైతము ఇరసాలలలో నుంచుట తీవ్రచర్య. హార్ల నడచుటకై సింధులో అమలు చేయబడిన సైనిక శాసనము అందరికి వర్తింప జేయబడుచున్నది. అని లాలచందు నవల్ రాయ్ గారు చెప్పిరి.

ప్రభుత్వమువారికి మిత్రుడుండడు

ఇరువురు కేంద్రశాసన సభ్యులను ప్రభుత్వమువారు చెరబెట్టిన విషయమై డా॥ బెనర్జీగారు ప్రస్తావించి, ఇట్టి పద్ధతులనే ప్రభుత్వము వారవలంబించుచో ప్రభుత్వమువారికి దేశములో మిత్రుడెవ్వడు నుండడని డా॥ బెనర్జీగారు చెప్పిరి.

ముస్లిమ్‌లీగు వైఖరి

హార్లపై సైనిక శాసన మమలు చేయబడినప్పుడు హిందువులు సంతృప్తి జెందిరి. అందరికి వర్తింప జేయబడినప్పుడు గగ్గోలు పెట్టుచున్నారు. ఇట్టి వారికి తగిన శాస్తి జరిగినది. అని ముస్లింలీగుకు చేరిన సయ్యదు నులాఖ్ ఖీనరాంగ్‌గా రనిరి.

ఇరసాలలో కష్టపడుచున్న యువకులను విడుదలచేసి, సుహృద్భావమున మెలంగి, దేశములో శాంతి సౌఖ్యముల నేర్పరుపవలెనని ఏ. ఎస్. దాసుగారు కోరిరి.

ప్రతివ్యంభనకు కారకులెవరు?

జమ్నాదాసు మెహతాగారు రిట్లు చెప్పిరి:— యుద్ధసమయమున కొన్ని నియమము లవసరమగుచున్నవి. ప్రజలకు అధైర్యము కలిగించు వదంతులు వ్యాపింపకుండ చేయుట నిర్బంధవిధానమని చెప్పవీలులేదు. శత్రువుపు తోడ్పడువారిపై చర్యలు గైకొనుట న్యాయసమ్మతమే.

రాజకీయ ప్రతిష్టంభనమునకు కారణము బ్రిటిషు ప్రభుత్వమువారే. మనము చేయుచున్న పనులన్నివారికే అనుకూలంగవున్నవి సుగ్ధ తరగతులవారు ఫాసిస్టులుగాన ఈ ప్రతిష్టంభనమును వారు తొలగింప జాలరు. కార్మికులు, కర్షకులు మాత్రమే ప్రతిష్టంభనమును తొలగింపగలరు. రాజకీయ ప్రతిష్టంభన మీర్పడినదను సాకు చెప్పి, యుద్ధ ప్రయత్నమునకు ప్రతికూలముగా చేయరాదు. నాజీ పద్ధతులకు, బ్రిటిషు పద్ధతులకు పోలికయే లేదు. కాని విద్రోహచర్యల నడంచుచున్నామను సాకుచెప్పి నిరపరాధులను ప్రభు

(3 వ పేజి చూడుడు)

బ్రిటనులో ఇండియా నిలవ మొత్తాలు

—(*)—

ఇండియా ప్రభుత్వం ఆర్థిక సభ్యుని సమర్థన

న్యూ ఢిల్లీ, మార్చి 8:—

నేడు భారత అసెంబ్లీసభలో బ్రిటనులో నున్న పౌను నిలవల వినియోగమునుగురించి చర్చించుటకై నియోగి గారు ప్రతిపాదించిన కోత్త తీర్మానము వోటులేకుండ సభవారిచే నిరాకరింపబడెను.

నియోగిగారు తీర్మానమును ప్రతిపాదించుచు యిట్లు చెప్పెను:—

బ్రిటనులో నున్న పౌను నిలవలతో భారతదేశములో నున్న బ్రిటిషువారి ఆస్తులను, ఇతర విదేశీయ ఆస్తులను కొనవలెనని భారత ప్రజలు కోరుచున్నారు. ఈనిలవల నిలవతగ్గకుండ చేయుటకు యెట్టిచర్య గయికొనవలచుచున్నారు? ఇందు విషయమై బ్రిటిష్ ప్రభుత్వమువారినుండి గారంటీలు గైకొందురా? ఈ నిలవలను విదేశీయ చెలామణిలోనికి మార్చుట కేమైన చర్యలు గైకొనబడినా? ఈ నిలవల విలువ తగ్గచో భారతదేశమునకు నష్టము కలుగకుండ చూడవలెను. బ్రిటిషు పరిశ్రమలను వృద్ధిచేయుటకై పునర్నిర్మాణ నిధి నేర్పరుచుచుండిరని భారతీయులలో అనుమానములు కలవు.

జమ్నాదాసు మెహతాగారు

ఈ దేశములో జారీచేయబడిన 614 కోట్ల నోట్లకు బదులు 445 కోట్ల కరెన్సీ రిజర్వు భారత దేశములో లేదు. యుద్ధములో భారతదేశము మిత్రమండలివారు ఓడిపోవుచో భారతదేశ ముగతి యేమికావలెను? పౌను విలువ యింకను తగ్గునను భయముకలదు. కనుక ఈ రిజర్వులను భారతదేశములోనే యుంచవలెను. పౌను ఋణమునుతీర్చుటలో భారతదేశమునకు చాల నష్టముకలిగెను. భారతదేశాభిప్రాయమును కనుగొనకుండ ప్రభుత్వమువారి పని చేసిరి. అని జమ్నాదాసు మెహతాగారు చెప్పిరి.

నౌమెనుగారు

పౌనువిలువ తగ్గనను భయ మేర్పడియుండుటచే, యిప్పుడు బ్రిటనులో నున్న మన పౌను నిలవలను డాలరులుగాగాని, సరుకులుగాగాని మార్చవలెనని నౌమెనుగారు చెప్పిరి.

సర్ జర్మి రెయిస్ మెను

చర్చకు ప్రత్యుత్తర మొసంగుచు సర్ జర్మి రెయిస్ మెనుగారిట్లు చెప్పిరి:—

ఇట్టి విషయములను సభలో బాహాటముగా చర్చించుట కష్టము. కనుక అనేక వివరములను నేను వదలివేయవలసియున్నది.

బ్రిటను, మిత్రమండలివారు అపజయము గాంచుచో భారతదేశము గతియేమగునని మెహతాగారడిగిరి. అట్టి సందర్భమున భారతదేశము, ప్రపంచమున ఈసామ్యుడు కంటె చాల ముఖ్యమైనవానిని గోల్పోవును. విజయముకలుగకపోయినచో రెట్టి అనర్థములు కలుగునో వూహింపనలవిగాదు. ఈ పౌనునిలువ లెట్లేర్పడినవి? యుద్ధప్రయత్నమునకై భారతదేశము కొన్ని సరుకులను ఉత్పత్తిచేయుచుండెను. బ్రిటను, మిత్రమండలి దేశములనుండి భారతదేశము తెప్పించుకొను సరుకులకంటె భారతదేశము పంపుచున్న సరుకుల విలువ హెచ్చు. బ్రిటెను యుద్ధకార్యములయందు నిమగ్నమగుటచేత భారతదేశమునకు కావలసిన సరుకులన్నిటిని సప్లయిచేయజాలక పోయెను. ఒక్క ఆయుధములనుమాత్రమే సప్లయిచేయుచుండెను. అన్ని సరుకులను పంపి పౌను నిలవలను ఖాళీచేయవలెనని మెహతాగారి ఉద్దేశ్యమా? ఈనిలవలు బ్రిటను భారతదేశమునకు చెల్లింపవలసినఋణము. ఈధనమును యితర ప్రదేశములకుమార్చవచ్చునా అని ప్రశ్నింపబడెను. ఈ విషయము బ్రిటనుకు యితర దేశములకు గల సంబంధములను బట్టియుండును. యుద్ధానంతరము సరియైన అంతర్జాతీయ యేర్పాటులు చేయుటవసరము. ఈ పౌను నిలువలను ప్రస్తుతము సరుకులుగా గాని, సర్వీసులుగా గాని మార్చ వీలుకాదు గనుక అది ఋణమేయగును.

విజయానంతరం చర్చింపవలసిన విషయం

విజయముకలుగుచో భారతదేశముచేయుచున్న సహాయమునకు తగిన ప్రతిఫలము రావలెనని కోరుటకు భారతదేశమునకు హక్కుండును. యుద్ధానంతర చర్చలలో భారతదేశమునకు తగినస్థాన ముండును.

రవీంద్రుని పట్ల గొప్ప అపచారం

—(:)—

నేషనలు వార్ ఫ్రంటు ప్రచారం

బొంబాయి, మార్చి 7:—

నేషనల్ వార్ ఫ్రంటువారు తమ ప్రచారంకోసంగాను దేవరంగతుడైన టాగోరు మహాకవిపేరును దుర్వినియోగం చేసినందుకు తీవ్రమైన అసమ్మతిని ప్రకటిస్తూ బొంబై టాగోరు సొసైటీ కార్యవర్గంవారి క్రింది తీర్మానం చేశారు:—

"నేషనల్ వార్ ఫ్రంటు (జేశీయ యుద్ధరంగము) వారు టాగోరు మహాకవి పేరును తమ ప్రచారముకోసం దుర్వినియోగం చేస్తూ పత్రికలలో ప్రకటనలు చేస్తున్నందుకు ఈ సంఘమువారు తీవ్రమైన అసమ్మతిని ప్రకటిస్తున్నారు. మహాకవి వ్రాతలలోని భాగాలను పూర్వోత్తర సందర్భాల నుంచి వేరుజేసి, రాజకీయ ప్రయోజనాలకోసం తారుమారుజేసి వినియోగించుకోవటం అమానుషమైన పని. తన అభిప్రాయాల నీవిధంగా తలకిందులుజేసి వుపయోగించుకోడం తప్పు అని ఖండించేందుకు టాగోరు కవి జీవించివుండలేదు గదా అనే వుద్దేశంతో నేషనల్ వార్ ఫ్రంటువారి రిట్టిపనికి సమకట్టి వుండవచ్చు. కాని, టాగోరు వాణి అణిగిపోలేదు. స్వాతంత్ర్యం పేరిటా, ప్రజాస్వామ్యం పేరిటా జరుపబడుతూ వున్న ఈ యుద్ధసమయంలో భారతదేశానికి ఈ రెంటినీ నిరాకరించడంవల్ల ఇండియాకు ఎంత అన్యాయం జరిగిందో, కవీంద్రు డింతులకై ఎంత పరితపించాడో చెప్పనక్కరలేదు.

కవీంద్రుడన్నమాటలు

నేషనల్ వార్ ఫ్రంటువారి ప్రచారం వల్లప్రజలు మోసపోకుండావుండగలందులకై, కవీంద్రు డిహలోకయాత్ర ముగించటానికి మూడుసెలలకు ముందు 1941 మేనెలలో 'నాగరకతకు వినాశము' అనే సందేశంలో వారుచెప్పిన మాటలను నివేదిస్తున్నాము:—

"మానవ సంబంధంయొక్క వుదాత్తతను కాపాడటానికి బదులు బ్రిటిషువారు భారతదేశ పరిపాలనలో 'లా ఆర్డరుల' పేరిట పోలీసువారి రాజ్యం స్థాపించారు. ఇలాంటి నాగరకాభాసాన్నిచూచి మేము మురియలేము. విధివిధానంవల్ల నేడు గాకుంటే రేపైనా, ఎప్పుడో వొకప్పుడు, ఆంగ్లేయులు భారతసామ్రాజ్యాన్ని వదులుకోక తప్పదు. కాని, బ్రిటిషువారు వెళ్లేటప్పుడు భారతదేశాన్ని ఏవిధంగా విడిచివెళ్లుతారు? ఎలాంటి సంతాపకరమైన పరిస్థితుల్లో దేశాన్ని వుంచివెళ్లుతారు? అనేక శతాబ్దాల తమ పరిపాలనాప్రవంతి ఇంకిపోయింతర్వాత ఎలాంటి పంకాన్ని, ఎలాంటి దుర్గంధాన్ని దేశంలో అట్టిపెట్టి వెళ్లుతారు? ఐరోపా హృదయంలో నుంచి సభ్యతా స్రవంతులు పుట్టుకొస్తవని నేనొకప్పుడు నమ్మేవాణ్ణి కాని, నాదేశయాత్ర ముగించనున్న ఈ తరుణంలో, ఆ ఆశ పూర్తిగా అడుగంటింది."

పై నుదహరించిన టాగోరు కవీంద్రుని అభిప్రాయాన్ని బట్టి నేషనల్ వార్ ఫ్రంటువారు అవమానకరమైన సదరు ప్రకటనను ఉపసంహరిస్తారనీ, టాగోరు కవి చంద్రుని స్మృతికి జరిగిన అపచారానికి తగిన విధంగా పరిహారం జరుపుతారని కోరుతున్నాము. (బాంబె క్రానికల్)

మూడు ముఖ్యాంశాలు

—(*)—

బొంబయిలో నేడునాయకులు చర్చించనున్న విషయాలు

బొంబాయి, మార్చి 8:—

రేపు బొంబాయిలో జరుగనున్న నాయకుల సభకు యేర్పాటులన్నియును పూర్తియైనవి. రేపు మధ్యాహ్నము 3 గంటలకు మలబారు హిల్లుమీదనున్న జయకరుగారి భవనములో సభ ప్రారంభమగును. 30 మంది నాయకులకు ఆహ్వానములు పంపబడెను. సప్రూగారు నేడు వుదయమునవచ్చిరి. కాశ్మీరు హౌసులో బసచేసిరి. నేడుమధ్యాహ్నము సప్రూ జయకరుప్రసాదుగార్లు మొదలైనవారు యిష్టాగోష్ఠిగా మాట్లాడుకొంటారు.

చర్చనీయాంశములు

1. గాంధిమహాత్ముని వెంటనే వదలుట. 2. ఇరసాలలోనున్న కాంగ్రెసునాయకులును యితరదొరతనమువారు పరస్పర అభిప్రాయములను తెలుసుకొనుట. 3. దేశములో అన్ని రాజకీయపార్టీలయొక్కయు అన్నిమతములయొక్కయు నాయకులతో కూడిన ఒక సంఘము నేర్పరుచుట. యివి మూడును నాయకులసభలో చర్చింపబడనున్న అంశములలో మిక్కిలి ముఖ్యమైనవి.

గాంధి విడుదల

గాంధిమహాత్ముని వదలవలెనని యీ సభవారు ఢిల్లీలో సభ జరిగినపుడే రాజప్రతినిధిని కోరిరి. గాని రాజప్రతినిధి అంగీకరించలేదు. గనుక గాంధిమహాత్ముని విడుదలను గురించి యిప్పుడు యీ సభవారు తమ సర్వశక్తులను పూర్తిగా వుపయోగించుటకు నిశ్చయించిరని తెలిసినది.

గాంధిమహాత్ముని విడుదలచేయుట మీదనే తక్కిన రెండు ముఖ్యాంశములను ఆధారపడియున్నవి.

దొరతనమునకును ఇరసాలలో నున్న కాంగ్రెసు నాయకులకును మధ్య రాయబారములను జరుపుటకు అఖిలభారత విఖ్యాతిగల కొద్దిమంది నాయకులతో కూడిన ఒక సంఘము యేర్పరుపబడును. ప్రధానములైన కొన్ని రాజకీయసమస్యలను గురించి యీ రెండు పక్షములవారి నిచ్ఛాభిప్రాయమును మిక్కిలి స్పష్టముగా యీ సంఘమువారు తెలుసుకొనెదరు. ఇప్పుడు కేవలము విరుద్ధముగా నున్న అభిప్రాయములకు సామరస్యమును కలిగించుటకు వీరు గట్టి ప్రయత్నమును చేసెదరు. రెండుపక్షములవారును పాతపగలను పూర్తిగా విస్మరించుటకు యీ సంఘమువారు గట్టి ప్రయత్నమును చేసెదరు. ఇండియాకును మిత్రమండలికిని కూడా లాభకరమైన వక కొత్త నిర్మాణ కార్యక్రమమును బొంబాయిలో యీసభివారు సిద్ధపరిచెదరు.

కిరసనాయిలు పొదుపు



లాంతరు

ఇండియాలో హరికెన్ లాంతర్లు 5 కోట్లకు మించివున్నవని అంచనా వేయబడినది. ఈ లాంతర్లు ఉపయోగించే వారందరూ—యీ క్రిందవుదహరించిన అతి సూక్ష్మనియమాలను అనుసరిస్తే—నిలువయైన కిరసనాయిలును యెంతో పొదుపు చేయవచ్చును.

(ఎ) గాజు చిమ్నిని ప్రతిరోజూ పరిశుభ్రముగా తుడుస్తూవుండండి. మసిబట్టిన చిమ్నీ, అంటే సాధారణంగా కావలసిన దానికన్నా పెద్దకొడి కావలసి వస్తుంది.

(బి) సరిసమానంగా వెలిగేటందుకుగాను వత్తిని తరచుకత్తిరిస్తూవుండండి.

(సి) వత్తిని కాలడానికి యెంత తక్కువగా అట్టేపెట్టడానికి వీలో అంత తక్కువగానే వుంచండి. సామాన్యమైన అవసరములకు అంగుళంలో ఎనిమిదవ వంతు వత్తి చాలును.

(డి) లాంతరులో కిరసనాయిలువుండే డబ్బీ బాగానికి ఎప్పుడూ మూత గట్టివుండేలా చూచండి లేకుంటే కిరసనాయిలు తక్కువగా ఆవిరి అవుతుంది.

చమురు పోసేటప్పుడు బయట పడకుండా చూడండి. వీటన్నింటిని మించి

నిజంగా మీకు దీపం అవసరమైతేనే తప్ప లాంతరు వెలిగించకండి

బర్మా-షెల్

BS6K 48



రుణము కావలెను

ద్రాక్షనదిపేలనుంచి ఒక లక్షవరకు ఋణము (0-8-0) సంవత్సరి వడ్డీకి కావలెను. ప్రతిసంవత్సరము వడ్డీవడ్డియు, ఆస్తులకొలతయు ఇవ్వబడును. సారవంతమైనభూములు, అరటితోటలు, మిడితోటలు, విస్తీర్ణమైన అరణ్యము కలిగి, జెడనాడకు సమీపమునయున్న గ్రామము మొదట్ల తగిలి యుండబడును. ఉత్తరప్రత్యుత్తరములు యీ క్రింది అడ్రసుకు వ్రాయుదురు.

బాక్సు నెం. 304 c/o ఆంధ్రపత్రిక, మద్రాస్.

వేలం నోటీసులు

తిరుపతి మునిసిపాలిటీ

ప్రజాక్షేమమూలముగా తెలియజేయునదేమనగా, 1943-44 సం॥ మునిసిపల్ వృత్తులను బహిరంగమైన వేలంలో విడుచుటకుగాను తిరుపతి మునిసిపల్ ఆఫీసులో 16-3-43 తేది మధ్యాహ్నం 11 గంటల సమయము వేలం జరుగును. వేలం షరతులు మునిసిపల్ ఆఫీసులో కనుగొనవచ్చును.

కమీషనర్,
మునిసిపల్ ఆఫీసు, తిరుపతి 8-3-43.

కాకినాడ మ్యునిసిపాలిటీ యాక

మాన్యములో నున్న "ములుకుట్ల మహాలక్ష్మమ్మ జేబీ ఇల్ ఫేర్ సెంటర్, కాకినాడ" తాలూకు ఎండోమెంటు భూముల స్వభాను సంవత్సరము లగాయితు సర్వజిత్తు ఆశ్వయుజవరకు (1943-1947) సంవత్సరముల కు సాయంబడి నిమిత్తము 19-3-43, ది 23-3-43, 24-3-43 సం॥ముల తేదీలలో మధ్యాహ్నము 3 గంటలకు కాకినాడ మ్యునిసిపల్ ఆఫీసువద్ద కమీషనరుగారిచే వేలము వేయబడును. కావలసిన ఇతర విషయముల మ్యునిసిపల్ ఆఫీసులో తెలుసుకొనవలెను.

కె. రామకృష్ణయ్య చౌదరి,
కమీషనరు.

టెండరు నోటీసులు

ఈ క్రింద వివరించిన పనులకు టెండర్లు పిలవడమైనది. టెండర్లు సీ. చేసి 24-3-43 తారీఖు సాయింత్రము 5 గంటల లోగా కడప డిస్ట్రిక్టు బోర్డు ఇంజనీయరు వారికి చేరునట్లు పంపుకొనవలెను. యి పనులకు సంబంధించిన ప్లానులు వగైరా ఈతర వివరములు తెలుసుకొన గోరువారు డిస్ట్రిక్టుబోర్డు యింజనీయరు వారి ఆఫీసులో ఆఫీసు జరుగు కాలములో తెలుసుకొనవచ్చును. టెండరు నమూనా ఫారములు ప్రతి ఒకటికి రు. 2-0-0 కట్టిన యడల యివ్వబడును.

1. పెన్నారు నదికి, సిద్ధవట్టము దగ్గిర కాస్వేపని రు. 98,500.

2. ముద్దనూరు - జమ్మలమడుగు రోడ్డు 10/4-11/2 లో, పెన్నారు నదికి కాస్వేపని రు. 52,300.

3. కోమూరు - చిట్వేలి రోడ్డు 0/3 లో సుంజల నదికి కాస్వేపని రు. 12,750.

కడప, 4-3-43. } హెచ్. ఆర్. ఆయోజిరావు, డిస్ట్రిక్టుబోర్డు ఇంజనీయరు.

ఈ దిగువ పేర్కొన్న పనులకు, డివిజనల్ ఇంజనీరు ఆఫీసువందు దొరకు నిర్ణీత టెండరు ఫారములలో, టెండర్లు సీలు టెండర్లు, తిరువళ్లై తిరుపతి దేవస్థానం, కమీషనరుగారిచే కోరబడుచున్నవి. టెండర్లు ది 30-3-43 వ తేదీ సాయింత్రం గం. 5 లవరకు తీసుకొనబడును. ది 31-3-43 వ తేదీన సాయింత్రం గం. 3 లకు టెండర్లు తెరవబడును. ప్రతి టెండరుతోను, అంచనా వేయబడిన మొత్తములో 5% మొత్తమును ఎర్నెస్టు డిపాజిట్టు పంపవలెను. ఇతర వివరములు, ప్లానులు, అంచనాలు వగైరాలను, తిరుపతిలో, డివిజనల్ ఇంజనీరు ఆఫీసువందు చూచుకొనవచ్చును. విశదాలకు, వుత్తరములు వ్రాయువారు, జవాబునకు గాను తిరుపతి డివిజనల్ ఇంజనీరుగారికి స్టాంపులను కూడ పంపుకొనవలెను.

పనులు

రిజర్వు అడవి సరిహద్దులు 5/3 మొదలు 5/7 వరకు, చంద్రగిరి రస్తా వెంబడి, మోటార్లు నడుచుటకు వీలగు ఒక గోడ్డు చేయవలెను. 30 అడుగుల ఒక స్పాన్ కాలువల స్ట్రక్చరును, 5/3, 5/4 మార్గములకు మధ్యనున్న కొండవాగుపైన, 3 అడుగులవి 6 వంతెనలును 4 అడుగుల స్పాను వంతెన ఒకటియును కట్టవలెను. అంచనా మొత్తం రు. 13,500.

మ. రా:—దూలాలు, సోండ్రు రైల్సుకు ఉక్కు, సిమెంటు, ఆర్. సి. కాంక్రీటుకు ఉక్కు కడ్డీలు డిపార్టుమెంటు ద్వారా సరఫరా చేయబడును. టెండరుచేయు టప్పుడు ఈ విషయములు మినహాయించవలెను.

బి. వి. శ్రీహరిరావు నాయుడు,
కమీషనరు, 6-3-43.

బహిష్టు — పిల్లలుగల్గినా, పిల్లలుగలుగ కపోయినా, పిల్లలుగలుగుచు నశించిపోయినవారికి (రజస్వర్లు) స్త్రీలకు తాపశిమందు, ఋతుక్రమరాహిత్యమును చికిత్సచేయు సంతోషకరమైనమందు డా॥ పి. దేవీ వారిచే కనుగొనబడినది. కూ. 3/- పోస్టేజి 9 అ. వెచ్చు.
Mrs. P. DEVEE, F. D. S., (M.A.)
Chanditolla(Russa), Tollygunge Calcutta.

గంటలపంచాంగం

చిత్రభాను సం॥ ఫాల్గుణ శు॥ చవితి 1943 సం॥ మార్చి 10 బుధవారము

సూ॥ ప 12-51 అస్త ప 11-57 వ ఉ 7-51 మె 9-28 కు వ రా 9-51 మె 11-28

శు॥ ద్వితీయ మార్చి 11 గురువారము

పం॥ కు ప 12-57 భర ప 12-38 వర్జ్యం రా 13 15 మె 2-56 కు

ఆంధ్రపత్రిక
చిత్రభాను సం॥ ఫాల్గున శు॥ తృతీయ మంగళవారము

ఇంగ్లాండులో ఎందుకు?

ఆంగ్లప్రభుత్వ మీ దేశమునకు చెల్లింపవలసి వచ్చుచున్న విస్తారమగు మొత్తములను ప్రభుత్వమువారాంగ్లదేశమునందే బ్రిటిషు చలామణియందు నిలువజేసి యుంచు పద్ధతివలన గల్గు నష్టముల గురించి, భారతీయవర్తక సంఘము విదివరకే హెచ్చరించి యుండెను. ఈ విషయమున ప్రభుత్వవిధానము భారతశాసనసభయందు గూడ నిన్న నిశిత మగు విమర్శలకు గురియైనది. కాని ఈ సందర్భమున, ఆర్థికసభ్యుని సమాధానములు, ప్రజల అనుమానములను మరింత అధికమొనర్చుచున్నవే గాని, వాని నేమాత్రము తొలగించగలుగ లేదనియే చెప్పవలసియున్నది.

ఈ నిలువల నిపుడు ఆంగ్లదేశమునందే యుంచుట భారతదేశమున కనేకవిధముల నష్టము. సంగ్రామ పరిస్థితులచే బ్రిటనుకు ఋణములు పెరుగుచున్నవి. సంగ్రామము ముగియునరికి, బ్రిటను అమెరికాకును, భారతదేశమునకును మాత్రమే గాక, ఇతర అధినివేశములకు గూడ చాల సొమ్మును చెల్లించవలసి యుండును. సర్ జరిమీ రెయిస్మన్ గారు అంగీకరించినటులు "ఆంగ్లదేశ మీఋణములను వస్తురూపమున దీర్చవలెనే గాని, నగదురూపమున దీర్చుట సాధ్యము గాదు." ఇన్ని ఋణములు దీర్చవలసి వచ్చినపుడు, బ్రిటను తన చలామణిని చవుకచేసుకొని, తన వస్తువులను తక్కువ ఖరీదులకు విదేశములలో విక్రయించి, దానితో ఋణముల తీర్చుకొనుటకు ప్రయత్నించుట సహజము. బ్రిటనునుండి ఈ బాకీలు వసూలు చేసుకొనదలచిన దేశములారసరులను పుచ్చుకొనక తప్పదు. ఆంగ్లదేశమునుండి అటుల సరకులు దిగుమతి చేసుకొనువో దేశీయ పరిశ్రమ లడుగంటును. గత మహాసంగ్రామమున మిత్రమండలికి కోట్లకొలది ఋణ మొసగిన అమెరికా, గత మహాసంగ్రామానంతర వత్సరములలో, ఈ విధముగ సరకుల దిగుమతి చేసుకొనుట కంటె నదలుకొనుటయే యుత్తమముగ పరిగణింపవలసివచ్చెను. ఈ సంగ్రామానంతరము ఋణదాతలగు దేశము లట్టి సంఘటనలనే మరల యెదుర్కొనవలసివచ్చుచో ఆశ్చర్య ముండదు.

సంగ్రామానంతరము, బ్రిటనును ఇతర యుద్ధ దేశములును గూడ, శిథిలమైపోయిన తమ దేశములలోనే పునర్నిర్మాణ కార్యములయందు నిమగ్నమై యుండుననియు, అందుచే కొంతకాలము వరకు బ్రిటరువంటి దేశములు ఇతర దేశములను సరకులతో ముంచివెయ్యవనను భయము లేదనియు ఆర్థిక సభ్యుడు సమాధాన మొసగెను. కాని అట్టి ఆశల కవకాశము గనుపింపదు ప్రస్తుతము సేనలలో చేరిన లక్షల కొలది ప్రజలందరు తిరిగివచ్చిన తోడనే, వివిధపరిశ్రమలలో పనుల కల్పించుటకు ఆంగ్లదేశమున అపుడే ఏర్పాటులు పూర్తి యగుచున్నవి. వెనుకటివలె నీసారి "నిరుద్యోగసమస్య" లేకుండ చేయుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. బ్రిటను "స్వదేశము నందలి శిథిలముల" పునర్నిర్మాణమొనర్చుకొనుటయె గాక, విదేశములలో వాణిజ్యపు పోటీయందు వెనుకబడకుండుటకు ఇప్పటి నుండియు ఏర్పాటులొనర్చుకొనుచున్నవి. కనుక ఈ విషయమున భారతీయ పారిశ్రామికుల అనుమానములు నిరాధారమైనవని త్రోసివేయుటకు వీలులేదు. ఇట్టిస్థితిలో భారతప్రభుత్వ మీ "నిలువ"లను ఈ దేశమునందలి విదేశీయ పెట్టుబడులను కొనివేయుటకు వినియోగించి, సంగ్రామానంతర మవసరమగు దిగుమతులు అప్పటి ఎగుమతివ్యాపారముపైననే ఆధారపడియుండునటుల వదలివేయుట ఉత్తమము.

అంతియగాక, రిజర్వుబ్యాంకువారి 'నిలువ'ను హామీగ నిడుకొని ఈ దేశమున నిపుడు కోట్లకొలది చలామణిని హెచ్చించుచున్నారు. ప్రస్తుత మీదేశమున వ్యాప్తియందున్నరు 614 కోట్ల చలామణికి పుండవలసిన "హామీ"లో రు 445 కోట్లనరకు ఆంగ్లదేశమున నున్నది. జమ్నాదాసు మెహతాగారు నుడివినటుల, ఇది అధికారులు చాల జాగ్రత్తగ నాలోచించవలసిన విషయ మనుటకు సందియము లేదు. మెహతాగారు భయపడినటుల, బ్రిటనున కెట్టి అపాయము సంభవింపక పోయినను గూడ—ఈ దేశమున ప్రజలకు విశ్వాసము నధికమొనర్చుటకైనను ప్రభుత్వము వారి నిలువలలో సాధ్యమైనంత వరకు వెంటనే ఈ దేశమునకు మార్చుటకు సాధనాంతరముల నాలోచించుటుచితము.

అభినందనం

శ్రీ రావుబహదూర్ పాకాల వెంకటరమణరావుగారు మైసూరు ప్రధాన న్యాయమూర్తిగా నియమించబడినందుకు మా అభినందనాలు. మదరాసు హైకోర్టులో ప్రభుత్వన్యాయవాదిగానేం, హైకోర్టు న్యాయమూర్తిగానేం శ్రీ వెంకటరమణరావుగారు నిపుణులూ, న్యాయపథానువర్తులనే ఖ్యాతి గడించి, న్యాయవాదులయొక్కా, సోదర న్యాయమూర్తులయొక్కా ప్రశంసలకు పాత్రులైనారు. ఆంతరంగిక జీవితంలోకూడా శ్రీ రావుగారు నిగర్వచూడామణులు, నిరాడంబరులు, మితభాషులూ, సరసులునూ. అరవయ్యేండ్లునిండి, పేరు మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి పదవినుండి విరమించి నప్పటికీ, ఇంకా అనేకసంవత్సరాలు ప్రజాసేవ చేయగలిగిన దేహ, మనస్కత్వములు కలిగివున్నారు. ఇట్టి సుప్రసిద్ధులను తమ సంస్థానానికి ప్రధాన న్యాయమూర్తులుగ వరించినందుకు శ్రీ మైసూరు సంస్థానాధీశ్వరులను అభినందించకుండా వుండలేము. మైసూరు దివానుగా నైన శ్రీ మాధవరావుగారు ఆంధ్రులు. మైసూరు ప్రధాన న్యాయమూర్తులు ఆంధ్రులు. ఉన్నతోన్నత పదవులాక్రమించిన వీరుభయులూ ఆంధ్రులైనందుకు సంతోషిస్తూ, వీరి యిరువురినల్లా ఆంధ్రుల యశశ్చంద్రికలు దేశదేశాలకూ వ్యాపింపగలవని ఆశిస్తున్నాము.

రష్యాయుద్ధం:

సిచేవ్కా పతనము

రష్యనులు వ్యాస్మాను సమీపించుచున్నారు

మాస్కో, మార్చి 8:—

సిచేవ్కా తమ హస్తగతమైనట్లు రష్యనులు నేడు నలువరచిన ప్రకటనలో కలదు. రెజెవునుండి దక్షిణముగా వ్యాస్మాకువచ్చు రైలుమార్గమున సిచేవ్కా పట్టణమున్నది.

వ్యాస్మాలోని శత్రుసేనకు ఉత్తరమునుండియేకాక మరి రెండు వైపులనుండి అపాయమేర్పడును. ఘటస్కునుండి నైరృతిగా బయలుదేరు రైలుమార్గముమీదుగా వేరొక సోవియటుసేన వ్యాస్మాను సమీపించుచున్నది. వాయవ్యదిశనుండి మూడవ సోవియటుసేన వ్యాస్మాకు పడమరగానున్న నిట్చంకాను చేరుకొనజూచుచున్నది. నిట్చంకా సోవియటు వశమైనచో, వ్యాస్మాలోని శత్రుసేన పడమరగా తప్పించుకొనిపోవుటకు మార్గముండదు.

ఈ విధముగా అన్ని వైపులనుండి వ్యాస్మాలోని జర్మనుసేన కురిత్రాడు బిగియుచున్న దృశ్యము చూడగా కొలదికాలము ముందున్న పరిస్థితి తల్లక్రిందగునని చెప్పవచ్చును.

స్మాలెన్స్కున కపాయము

140 మైళ్ల దూరమున నున్న మాస్కోపై విజృంభించుటకుగాను జర్మనుసేన కేంద్రీకరింపబడియున్న ఈ వ్యాస్మా పట్టణము త్వరలో రష్యనుల స్వాధీనము కానుండుట వల్ల వారి కిన్నటినుండి స్మాలెన్స్కు రంగంలోని స్మాలెన్స్కు నగరమునకు పోవుటకు మంచిదారి యేర్పడగలదు రష్యాలో జర్మనులకు గల కేంద్రము లన్నిటిలోకి స్మాలెన్స్కు చాలా పెద్దదనుటలో సందేహము లేదు. ఇది వారికి ఆయువుపట్టువంటిది.

సిచేవ్కా యుద్ధ వివరములు

సిచేవ్కావద్ద జరిగిన యుద్ధములో 8 వేల మంది జర్మనులు మరణించినట్లు రష్యనులు ప్రకటన చెప్పుచున్నది. 314 టాంకులు 300 ఫిరంగులు 22 రైల్వేఇంజన్లు చాలా ఫిరంగి సుండ్లు, మందుగుండులు ఇతర యుద్ధసామగ్రి సోవియటు స్వాధీనమయ్యెను. ఇది జర్మనులకు గొప్పనష్టము.

ఓరెలు బ్రియాన్స్కులవంకకు సోవియటు పురోగమనం

మాస్కోరంగ దక్షిణభాగమున ఓరెలు బ్రియాన్స్కులను చుట్టుముట్టి స్వాధీనపరచుకొనుట ప్రస్తుతము రష్యనుల లక్ష్యమై యున్నది. ఓరెలుకు వాయవ్యమున 4 తుపాకి సైనికుల డివిజనులతోను టాంకుదళములతోను తమ సైన్యముపై రష్యనులు త్రోసి విజృంభించినట్లు జర్మనురేడియో నేటి రాత్రి తెలియజేసెను.

బ్రియాన్స్కును కూడ వెనుకవైపునుండి వచ్చి చుట్టుముట్టుప్రయత్నము కొనసాగుచున్నది. సెవెస్కువద్ద జరిగినబ్రియాన్స్కు కీవురైలు మార్గవిచ్ఛేదము బ్రియాన్స్కు స్వాధీనమునకు చాలా ఉపకరించగలదు. అప్పుడు కీవునుండి బ్రియాన్స్కులోని జర్మనులకు సప్లయిలు పోజాలవు.

మాస్కోరంగమును గురించి రాయిటరు ప్రత్యేక విలేఖరి తెలుపు వివరములు:—

"ఘటస్కుకు పడమర పందద్దలయుల నుండి శత్రువు పారిపోయెను. ఓరెలినికోకు దక్షిణమునను రెజెవుకు పడమరను గూడు సురక్షితమగు శత్రుస్థావరములు రష్యనశమైనవి.

వ్యాస్మా పట్టణము చుట్టుగల ప్రదేశము అడవులమయ మయ్యును, సోవియటు టాంకులులక్ష్యపెట్టకుండ ముందుకు చొచ్చుకొనిపోవుట ఆశ్చర్యజనకము.

యూక్రేను రంగం

యూక్రేను దక్షిణభాగమున వారాషిలాన్ద్రోవనకు పైరుతిగా జరిగిన గొప్ప యుద్ధములో చెల్లాచెదరైన జర్మను కాల్బలములు టాంకులు నాశనముకాగా మిగిలినవి వచ్చినదారి పట్టి యథాస్థానములు చేరుకొన్నవి. ఈడాన్టెట్జు ప్రదేశమున యింకను యుద్ధము ముమ్మరముకా లేదు కాని త్వరలో ఉగ్రతవహించి విశేషమగు శత్రునష్టమునకు కారణముకాగలదు.

కాకసస్ రంగం

కాకసస్ రంగంలో కెర్చ్ సముద్రతీరమున మంచుగడ్డలు కరిగి నేల జలమయమగుటవల్ల యుద్ధము జరుగుట కనుకూలముగా లేదు.

టర్కీ అధ్యక్షుని ఎన్నిక

ఇనియూనూగారినే ఎన్నుకొనిరి

లండన్, మార్చి 8:—

టర్కీ అధ్యక్షునివికి మరల ఇనియూనూగారే ఎన్నుకొనబడిరి.

ఈజిప్టు-హోలెండు సంప్రతింపులు

కైరో, మార్చి 8:—

హోలెండు రాజప్రతినిధులు కైరోలో ఈజిప్టు రాజుగారితో చాలాసేపు సంభాషించిరి.

ట్యునీసియా:

మారెత్ కోటల యుద్ధం

గొప్ప జర్మను సేన తయారుగానున్నది

లండను, మార్చి 8:—

దక్షిణ ట్యూనీసియాలో మారెత్ కోటల పంక్తులకు తూర్పునగల అష్టమ బ్రిటిషు సైన్యము పైబడి పోరుటకుగాను ఈ కోటలలో రామెలు సేనాని గొప్ప జర్మనుసేనలను యుద్ధసామగ్రిని చేర్చియుంచినట్లు బ్రిటిషు విమానములకు గోచరమైనది. ఈ కోటలనుండి పలువడి జర్మనుసేనలు మరల త్వరలో బ్రిటిషుసైన్యమును ఎదిరించుట తథ్యమని మిత్రమండలివారి ఆర్టిలరీరేడియో తెలియజేసెను. ఇంతవరకు ఇట్టి ప్రయత్నములు విఫలమైనవి. మెడిటైనుకు ఉత్తరమునను నాయవ్యమునను గల ప్రదేశమువరకు శత్రుసేన వెనుకకు తగ్గవలసివచ్చెను. శనివారంనాడు ఒక్కటాంకు రమది నష్టముకాకుండ 33 జర్మను టాంకులను బ్రిటిషువారు నాశనముచేసిరి. మెడిటైను ప్రదేశమును వశముచేసికొనుట శత్రులక్ష్యమనుటలో సందేహములేదు. అష్టమ బ్రిటిషు సైన్యముపై విజృంభించుటకు ఈ ప్రదేశము చాలా అనుకూలము.

జఫ్సా ప్రదేశము

దక్షిణ ట్యూనీసియాలో మారెత్ కోటల కొఱకు జరుగుచున్న యుద్ధముతోపాటు, మారెత్ కోటలకు పడమర జఫ్సా ప్రదేశములో జరుగుచున్న యుద్ధముగూడ సమాన ప్రాముఖ్యముకలది. జఫ్సాకు 35 మైళ్ల పడమరగాగల రెడియెటును ఫ్రెంచివారు జర్మనులను వెళ్లగొట్టి స్వాధీనపరచుకొన్నట్లు ఫ్రెంచిప్రకటన తెలుపుచున్నది.

పాపెల్ జెరిడ్ సరోవరతీరమున టోజూరులో గల జర్మనుసేనను ఫ్రెంచి సేనలు చుట్టుముట్టుటకు పూనుకొనెను.

ట్యూనీసియా మధ్యభాగంలో మిత్రసేనలు సుప్రతిష్ఠితములైనవి. కనుక వాటిని ఇక కదల్చుట చాలాకష్టము.

ఉత్తర ట్యూనీసియాలో మరికొన్ని చోట్లను మిత్రసేన లాక్రమించెను.

యుద్ధతంత్ర వివరణము

ట్యూనీసియాలో అష్టమ బ్రిటిషు సైన్యమునకు ప్రథమ బ్రిటిషు సైన్యమునకు మధ్య చిక్కిన రామెలుగారి జర్మనుసేన అవలంబించుచున్న యుద్ధతంత్రము 1814 లో నలువైపుల శత్రుసేనలు చుట్టుముట్టిన పుడు ఫ్రెంచి వీరుడగు నెపోలియను అవలంబించిన యుద్ధతంత్రమును పోలియున్నది. ఒక్కొక్క శత్రుసేనను విడివిడిగా అటకాయించి త్వరత్వరగా నాశనము చేయుటకు నెపోలియను పూనుకొని విఫలమనోరథుడయ్యెను. నెపోలియనుకు పట్టినగతి రామెలుకును తప్పదు. ప్రస్తుతము అష్టమ బ్రిటిషు సైన్యమును ఓడించుటకును అంతవరకు ప్రథమ బ్రిటిషు సైన్యము తమపై పడకుండ నివారించుటకును జర్మనులు పాటుపడుచున్నారు. ఉత్తర ట్యూనీసియాలో జర్మనులు యుద్ధము ప్రారంభించినది కూడ ఇందు కొరకే. ఉత్తర ట్యూనీసియానుండి ట్యూనీసియా మధ్యభాగము ద్వారా దక్షిణ ట్యూనీసియాలోని మారెత్ కోటల వరకు ప్రథమ బ్రిటిషుసైన్యమును రానీయకుండుటే జర్మనుల ఉద్దేశ్యము. ప్రథమబ్రిటిషుసైన్యము మారెత్ కోటలను పడమటినుండియు 8 వ బ్రిటిషుసైన్యము తూర్పునుండియు ఏకకాలమున మట్టడించిన తన కెట్టి దుస్థితి తారసిల్లునో శత్రువుకు బాగా తెలియును. అందుకే ట్యూనీసియా మధ్యభాగంలో, ప్రథమ బ్రిటిషు సైన్యమును దక్షిణ ట్యూనీసియాలోనికి రాకుండ వెనుకకునెట్టుటకు రామెలుగారు ప్రయత్నముచేసిరి. కాని అది నెరవేరలేదు.

శత్రునావల ముంపు

సిసిలీనుండి ట్యూనీసియాకు సప్లయిలను సైనికులను తెచ్చు మూడు జర్మను నావలు విమానములు వేసిన బాంబులకు మునిగిపోయెను. మరి రెండు తగలబడెను.

బొంబాయిలో ఫిలిప్సుగారు

పత్రికాసంపాదకుల విందు

బొంబై, మార్చి 8:— అ. భా. వార్తాపత్రికా కాన్ఫరెన్సు బొంబై రాష్ట్రీయ కార్యనిర్వాహక వర్గం తరపున యూరోపియన్ ప్రతినిధియైన విలియం ఫిలిప్సుగారికి నేడు విందుచేయబడింది. సుమారు ముప్పావుగంట సేపు పత్రికా సంపాదకులు, ఫిలిప్సుగారూ అనేకవిషయములను గురించి ఇష్టాగోష్ఠి సలుపుకున్నారు. 40 మందికి పైగా సంపాదకులీ విందులో పాల్గొన్నారు.

అమెరికా సంయుక్తరాష్ట్రముల అధ్యక్షుడు రూజ్వెల్టుగారి స్వంతప్రతినిధి విలియం ఫిలిప్సుగారితో నేడు బొంబాయిలో అమెరికా రాయబారి కార్యాలయములో డా॥ వై. హా., ఎం. ఆర్. జయకరు, సర్ చిమనలాలు సెతల్వాడు, సర్ చునీలాలు భాయిందరు మొహాలీ, ప్రొఫెసరు కె. టి. షా గార్లు సంభాషించిరి.

భారత హిందూ మహాసభ అధ్యక్షుడు వి. డి. సావర్కరుగారు విలియం ఫిలిప్సుగారితో రేపుల్లుండి 10 వ తేదీ బుధవారము నాడు బొంబాయిలో సంభాషించెదరని తెలిసినది.

బొంబాయిలో రేషనింగు

4 లక్షల చీట్లు బట్వాడ

బొంబాయి, మార్చి 8:—

ఏప్రిలునుండి ప్రారంభింపబడనున్న ఆహార పదార్థముల కొలత సప్లయి (రేషనింగు) స్కీమునకు ప్రారంభచర్యగా, యిప్పటికే నగరంలో 4,00,000 రేషనుచీట్లు యింట్లయజమానుల కొసంగబడెను. అందరికి యీ చీట్లు అందజేయుటకు వీలుగ నుండేటట్లు నేడు పబ్లికు పెలవుదినంగా ప్రకటించబడెను. ఈ చీట్లు మనియార్డరు ఫారమంతగ నీలంరంగులో నున్నవి. కుటుంబానికి యింట్లో ఉన్నవారి సంఖ్యను బట్టి ఎన్నియూనిట్లు యిస్తురో అన్ని కన్నాలు కాగితంలో పొడిచెదరు.

నేడు సుమారు ఏడువేలమంది గుమాస్తాలు యీ చీట్లు పంచుచున్నారు. నగర జన సంఖ్యలో సుమారు నూటికి 80 మంది నిన్న సాయంత్రానికే చీట్లు అందుకొనిరి. గత వారంనుండి యిది పంచుచున్నారు.

(అ. ప్రె.)

నాగపూరు సంఘటన

యథార్థ విషయం ఆనేగారి ప్రకటన

బొంబాయి, మార్చి 9:—

శ్రీ ఎం. ఎస్. ఆనేగారొక ప్రకటన చేస్తూ 25 వ తేదీన నాగపూరు రైలుస్టేషను వద్ద జరిగిన సంఘటనను గూర్చి పత్రికలలో పడ్డ వార్తలు సరిగ్గా లేవనీ, సోల్జర్లు ఆక్రమించి ఉండే రెండవ తరగతి పెట్టెలో పొరపాటున తన సామాను పెట్టబడినదనీ, వాళ్లు హరారానుంచి వస్తున్నారనీ, ఈ విషయం తెలిసినమీదట వేరే ఇంకోపెట్టెలో తమకు తావుచూపించబడెననీ తెలియచేస్తున్నారు.

ఒకదినంలో బడ్జెటువర్షు ముగింపు

కరాచి, మార్చి 8:—

సింధుశాసనసభ గత సమావేశమునందు పకిస్తానుకి అనుకూలంగా యితర రాష్ట్రాలన్నింటికన్న ప్రప్రథమంగా ఓటుచేసి కీర్తి గడించెను. నేడు సభలో ఆకాయ వ్యయపట్టిక అంతా ఆరురోజులు చర్చింపవలసింది నేడే పూర్తిచేసి ప్రఖ్యాతి గన్నది. ఈవిధంగా ఒకేనాడు బడ్జెటంతా ఆమోదించుట రాష్ట్రీయ స్వాతంత్ర్యంగల ఏ శాసనసభయందు ఎన్నడు జరుగలేదు. మంత్రివర్గం పార్టీ బలాన్ని యీ చర్య చాటుచున్నదని అధ్యక్షుడు సయ్యదు మీరాను మహమ్మద్దు పాగారనిరి. అల్లాబక్సుగారు మాజీప్రధాని నేడే ప్రథమదఫా సభకు వచ్చిరి.

(అ. ప్రె.)

గ్రామసీమలో విద్యావ్యాప్తి

ఉపాధ్యాయులకు విద్యాశాఖాడైరక్టరు హితవు

చెన్నపురి, మార్చి 9:—

గ్రామసీమల్లో విద్యను వ్యాప్తిచెయ్యటమే ఇప్పటి కర్తవ్యం. అందుకు ఉపాధ్యాయులు వెనుదీయక తమ కర్తవ్యాన్ని పాలించాలి అని విద్యాశాఖా డైరక్టరు ఆర్. ఎం. స్టాడాంగారు నిన్న సాయంత్రం మ్యూజియం థియేటరులో జరిగిన ప్రెయినింగుస్కూలు విద్యార్థుల వార్షిక సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. మద్రాసు విశ్వవిద్యాలయోపాధ్యాయులు డా॥ లక్ష్మణస్వామి మొదల్యారుగారు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ వచ్చినవారికి స్వాగతమిచ్చారు.

స్టాడాం ప్రసంగం

స్టాడాంగారు తమ ఉపన్యాసంలో ఇల్లా చెప్పారు. ఉపాధ్యాయులకు నాలుగు బాధ్యతలు గలవు.

విద్యావిధానములో వెనుదీయక నిరక్షరతను బాపవలెను. చాలమంది ఉపాధ్యాయులు గ్రామసీమల్లో పనిచేయుటకు యెందుచేతనో ముందుకు రారు. ఉపాధ్యాయులు పూనుకొన్న గాని విద్యావ్యాప్తి సరిగా గాదు. ఉపాధ్యాయ వృత్తి అట్టహాసపూరితము గాదు. బాధజనకమూ గాకపోవచ్చు. గాని వారిసేవ ఇంతింత యని చెప్పరానిది గ్రామీణులకు ఆరోగ్యమును గరపవలెను. ఎట్టి పరిస్థితులయందు గాని మీ ఉత్సాహమును తగ్గిపోనియరాదు.

గోఖలే ఆదర్శం

డా॥ లక్ష్మణస్వామిగారు మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి స్వీకరించి నవారెన్నడూ విద్యార్థులు నే ఉండవలెననియూ, వివాదాస్పదమైన రాజకీయములందు ప్రవేశించక గోఖలే, శ్రీనివాస శాస్త్రిగారలనే ఆదర్శముగ నుంచుకొని మెలగవలెననియూ, ఉపాధ్యాయులు వేయి బునాదులపైన విశ్వవిద్యాలయం వారు నిర్మించు భవనశోభ ఆధారపడియుండునని యూ తెలిసిరి.

మద్రాసు వర్తకప్రముఖుని దారుణహత్య

తిరువేంద్రం ఎక్స్‌ప్రెసు 1 వ తరగతిలో సంభవం

మదరాసు, మార్చి 9:—

ఈవారాళ ఉదయం ఎగ్మూరు స్టేషనుకు వచ్చిన తిరువేంద్రం ఎక్స్‌ప్రెసు బండి 1 వ తరగతి పెట్టెలో లక్షాధికారి బ్యాంకరు ఇండియను బ్యాంకు డైరెక్టరు దేవకోట వాస్తవ్యుడగు శ్రీ ఓ. ఆర్. ఓ. ఎం. ఎస్. పి. లక్ష్మణన్ చెట్టియారు (42 యేండ్లు) ప్రయాణంచేయుచుండగా మార్గమున ఎవ్వరో ఆతని గొంతును కత్తితోనొసి దారుణముగా హత్య గావించినట్లు సంజేహింపబడుచున్నది. శ్రీ చెట్టియారు శవం 1 వ తరగతిలో రక్తసిక్తమై పడియుండెను. ఆతని పెట్టె ఒకతాళముచెవితో తెరువబడియుండెను. శ్రీ లక్ష్మణచెట్టియారు మొన్న శనివారమే మధురకువెళ్లి తిరిగి అక్కడనుండి నిన్న మదరాసుకు బయల్దేరిరి. మార్గంలో యీ ఘోరమైన అమానుష కృత్యం జరిగెను. వారికి భార్యయు, 7 గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలరు. హత్య విషయమై దర్యాప్తు జరుగుచున్నది.

రాకపోకలు

మదరాసు, మార్చి 9:—

కార్మిక కమిషనర్ యస్. ఆర్. బ్రిస్లీగారు నిన్నరాత్రి సామర్లకోటకు, రివిన్యూ బోర్డు సభ్యుడు సి. హెచ్. మాస్టర్ మెన్ గారుగస్తీకి గవర్నరు మిలిటరీ కార్యదర్శి జి. బి. హార్వెల్ గారు ఉదకమండలమునకు వెళ్ళిరి.

బ్రిటిషు విమానదాడి

లండను, మార్చి 8:—

బ్రిటిషువిమానములు జర్మను వాయవ్య భాగమున లింగెన్ మీదను ఉత్తరఫ్రాన్సులో సుల్నోయీమీదను బ్రిటిషు విమానములు బాంబులు వేసెను.

జర్మను విమానదాడి

లండన్, మార్చి 8:—

జర్మను విమానములు బ్రిటనుమీదకు ఆదివారంరాత్రివచ్చి హాంకాంటిన్ ప్రదేశముపైన బాంబులు పడవేసెను.

అమెరికను విమానదాడి

లండను, మార్చి 8:—

నైఋతి పసిఫిక్ ప్రాంతమున న్యూగినీ కోస్తావద్ద 8 వేల టన్నుల జపానువారి డార్విసుద్గర బాంబు దెబ్బతిన్నది.

కాయిహిలీకొలంబంగరా దీవుల లోని శత్రుస్థావరములమీద గూడ దాడులు కొనసాగెను.

తిరుపతి చందాదార్లకు మనవి

తిరుపతి, తిరుమల, రేణిగుంట, కాళహస్తి మరియు పరిసర ప్రదేశాలలో మా ఆంధ్రదిన, సచిత్రవార, భారతీమాస పత్రికలను వారి స్వంత బాధ్యతపై విక్రయించుటకు శ్రీ కె. జగన్నాథం నాయుడు గారి స్థానే 8-3-43 నుండి శ్రీ కె. శ్రీనివాసన్ గారిని మా న్యూస్ వెండరుగా నియమించినాము.

మేనేజరు, ఆంధ్రపత్రిక.

ప్రకటన

నా జ్యేష్ఠకుమారుడు చి॥ పోతరాజు శీతారామరావుపు తెనాలి నాస్తవ్యులు శ్రీ సంకా వీరభద్రయ్యగారి కుమార్తె చి॥ సౌ॥ రాజశ్యామల నిచ్చి 12-3-43 తేదీ జరుగునని తెలియపరచిన వివాహము అనివార్యములు కారణములచే ఈనెల 19 వ తేదీ శుక్రవారము ఉదయమున జరుగునటులు నిశ్చయింపబడినది. కావున బంధు, మిత్రులు యీమార్పును గమనింపప్రార్థన.

తటవర్తి నాగపోతరావు
బ్యాంకరు, ప్రాప్రయిటరు, బృందావన్ టాకీస్, మచిలీపట్నం.

FREE!
ART PHOTO ALBUM
French Art Photos of beautiful young girls in charming

అడ్రసు మార్పు Tel: 'INEASTWEST'

ఈస్టు అండ్ వెస్టు ఇన్సూరెన్సు కంపెనీ, లి॥

మద్రాసు.

ఈ పై ఆఫీసు, మద్రాసు, హైకోర్టునకు యెదురుగా ఎస్ప్లనేడ్‌లో మా స్వంత "ఈస్టు అండ్ వెస్టు బిల్డింగు" నకు శాశ్వతముగా మార్చబడినది

పాలసీదారులు, ఆర్గనైజర్లు, ఏజంట్లు దయచేసి పై 'అడ్రసు మార్పును' గమనింప గోరెదవు.

ఆర్షరసాయనశాల

ముక్త్యాల (కృష్ణా)

మా ప్రసిద్ధౌషధములనుఒకసారివాడిచూడుడు!

1. అభ్రకభస్మము(అమృతమువంటిది)
2. వసంతకుసుమాకరము (ప్రమేహములకు పెన్నిధి)
3. మహాసూతికాభరణము (శాలింతలకు పరమౌషధము)
4. సువర్ణ సుందరరసము (సర్వమేహములకు సింహము)
5. క్షీరబలాతైలము (వాతరోగములకు బ్రహ్మాయుధము)
6. మహా సూర్యావర్తి (పైత్యరోగాలను పారదోలును)

ఇంకా సమస్తాయుర్వేదౌషధములు దొరుకును. స్వయముగా వచ్చిగాని, ఉత్తరప్రత్యుత్తరముల ద్వారాగాని సలహా పొందవచ్చును.

Consulting Physician:—

ఆయుర్వేదభూషణ నెం. 6.

వేటూరి శంకరశాస్త్రి, ఎ.ఎం.ఎ.సి.

స్ట్రింలైన్ ఫిల్టర్లు



ఇప్పుడు నూనెను పొదుపుగా వాడుకోటం చాలా అవసరం. నూనెధరలు తప్పక వెరుగుతవి

కాని, స్ట్రీంలైన్ ఫిల్టర్లను అమర్చుకొని లూబ్రికేషన్‌ధరలను తగ్గించుకోవచ్చును.

మడ్డి నూనెను ఇంజనులో పోయకమునుపు ఎంత శుభ్రమైన క్రొత్తనూనెగా వుంటుందో దాని మాదిరి చేసుకోండి.

మంచినూనె తరిగిపోదు.

సోల్ ఏజంట్లు:

గ్రీవ్సు కాటన్ అండ్ కో., లిమిటెడ్,

పోస్టు బాక్సు 207.

బొంబాయి - మద్రాసు - లాహోరు.

ఇతర ఔషధములకు లొంగని తీవ్రమగు నా లివర్ జబ్బును పోగొట్టి, నన్ను కాపాడినది.

అన్ని చోట్ల అమ్మబడును.

జమిశ వెంకటరమణయ్య & సన్స్,

మైలాపూరు, మద్రాసు.

బ్రాంచీలు:- కలకత్తా, బొంబాయి, బెంగుళూరు, తిరుచినాపల్లి, లక్నో, విజయనగరం.

సి. ఆర్. ప్రకటన

(1-వ పేజి తరువాయి)

"నేను మహాత్ముని చూచుటకు రాజప్రతినిధి అనుమతి నిచ్చెనన్నవార్త నల్లడిరైన వెంటనే దేశములో అల్లరులు తగ్గిపోగలవు. ప్రజల భావములలో గొప్పమార్పు కలుగగలదు." అని నేను గట్టిగా నమ్ముటవలననే అనుమతి యివ్వవలెనని రాజప్రతినిధిని కోరితిని. గనుక రాజప్రతినిధి నా కనుమతిని యివ్వకపోవుటగా పప్పు దురదృష్టమనియే నేను నమ్ముచున్నాను. నేను మహాత్ముని తో మాటలాడియుండినచో కాంగ్రెసుకును ప్రభుత్వమునకును సమాధానము కలుగగలదనుకూడా నేనాశించుచుంటిని. అట్టిది కలుగకుండా చేసినవాడు రాజప్రతినిధియె."

గాంధిగారు స్వయంగ యెట్టి అభిప్రాయం ఇవ్వజాలరు

నవంబర్ నెల 13 వ తేదీని నేను మరల ఢిల్లీలో విలేఖరుల సభలో నిటుల తెలిపితిని.

"దేశములో జరుగుచున్న అల్లరులను గురించి మీ అభిప్రాయమును తెలుపవలెనని యెవ్వరును గాంధిమహాత్ముని కోరకపోయినను చెరసాలలోనున్న గాంధిమహాత్ముడు పీటినిగురించి తనంతటతానే తన అభిప్రాయమును వెల్లడించవలెనని రాజప్రతినిధి తెలుపుట యెంతమాత్రమును న్యాయముకాదు. "దేశములో జరుగుచున్న అల్లరులను నిరసించుచు మీరిప్పటివరకును వక్క ప్రకటనకైనను యెందుకు చెయ్యలేదు ?" అని మహాత్ముని అడుగవలెననియే నేను నిశ్చయించితిని. పీటిని పూర్తిగా నిరసించుచు 1942 సెప్టెంబరు 28 వ తేదీ నే మహాత్ముడు రాజప్రతినిధికి లేఖను వ్రాసెనన్న విషయము అప్పటికి దేశీయులకందరికిని కూడా తెలియదు, గనుక నాకుకూడా తెలియదు. ఆ లేఖలో మహాత్ముడు యితరవిషయములను గురించికూడా వ్రాసినందువలనను దానిలోనున్న లోపములవలనను రాజప్రతినిధికి మహాత్మునిపట్ల విముఖత కలిగినదని వూహించినప్పటికిని, "గాంధిగారు నాకిటులనొక లేఖను వ్రాసిరి" అని రాజప్రతినిధి నవంబరు నెలలో నాతోనైనను చెప్పియుండినయెడల దేశములో నిరపరాధులైన వారికి పెక్కుమందికి అటుపిమ్మట కూడా యిట్టి కష్టములు కలగకుండునట్లు నేను ఆ లేఖను గురించి దేశీయులకందరికిని తెలియజేసియుందును.

గాంధిగారు విచారపడ్డారు

గతనెల 26 వ తేదీని నేను ఆగాఖాను మందిరములో మహాత్మునితో మాట్లాడితిని. అటుపిమ్మట మరి రెండు మూడుసారులు కూడా నేను మహాత్మునితో మాటలాడితిని. దేశములో జరుగుచున్న దౌర్జన్యకృత్యములను నిర్మూలనమును గురించి నేను మహాత్మునికి తెలియజేసితిని. పీటిని మహాత్ముడు పూర్తి నిరసించెను. మహాత్ముడు నాతో నిటులు తెలిపెను. "నాపేరుతోను, కాంగ్రెసువారి పేరుతోను యిట్టిదౌర్జన్యములను జరుపుటకును పీటిని జరుపవలెనని ప్రోత్సాహపరుచుటకును దేశీయులకందరికిని యెట్టిఅధికారమునులేదు. 1942 సెప్టెంబరు 28 వ తేదీని నేను పీటిని నిరసించుచు రాజప్రతినిధికి వ్రాసినలేఖను రాజప్రతినిధి వెంటనే పత్రికలలో ప్రకటించక పోయినందుకు నేను చాలా దుఃఖపడుచున్నాను. రాజప్రతినిధి యీలేఖను గత నెలలోనే మొదటిసారి ప్రకటించెను. ఇది మిక్కిలి శోచనీయము."

గాంధిమహాత్మునికి దేశాంతరవాసము

"ఇండియా దొరతనమువారు గాంధిగారిని యిండియా నుండి మరివక దేశమునకు పంపించి వేసెదరని వదంతిగా నున్నది" అని యిటీవల ఢిల్లీలో ఒకపత్రికలో ఒకవార్త వెలువడినది. బాధ్యతగల వారి సలహాను దొరతనమువారు తృణీకరించుచున్నందున వారు మహాత్ముని దేశాంతరమునకు పంపుటకు కూడ వెనదీయరని యూహించుట కవకాశము కలిగినది. వారిదివర కిట్టి పొరబాటుల నెన్నిటినో చేసియున్నారు. వారిటుల చేసినయెడల భారతీయుల ఆగ్రహావేశము ఆకాశము నంటకమానదు. గనుక అతిసాహసికమైన యిట్టి కార్యమును చేయక తప్పదని బ్రిటను దొరతనమువారు నిశ్చయించకుందురుగాక. భారతీయుల మనస్సు లిదివరకే ఆగ్రహముతో నిండినిబిడి కృతములై యున్నవి. ఇట్టి సమయములో మహాత్ముని మరివక దేశమునకు పంపవలెనని దొరతనమునకు సలహాయిచ్చుట కెవరైనను సాహసించుదురా వారు దేశములో శాంతిని పూర్తిగా నిర్మూలించినవారే అగుదురు. దేశములో స్థితిగతు లిదివరకే పూర్తిగా చెడిపోయినవి.

సమాధానమునకు అవకాశము

అయినను సమాధానము కుదురుటకును దేశములో శాంతి దేర్పడుటకును కూడా యిపుడే అవకాశములు గోచరించుచున్నవి. కొన్ని సందర్భములలో అతి భయంకరమును గాఢాంధకార బంధురమునుమైనవి కాళరాత్రియందునే ఆశాజ్యోతి సందర్శనముకూడా కలుగుచుండును.

గాంధీజీతో సంభాషణలకు అనుమతి

దేశములో బాధ్యతగలఅన్నిపార్టీలనాయకులతోను గాంధిమహాత్ముడు తక్షణమే కలసి మాట్లాడుటకు రాజప్రతినిధి వెంటనే అనుమతి నియ్యవలెను. ఇది ముఖ్యతమమైన కర్తవ్యము. రాజప్రతినిధి యిటులచేసిన యెడల భారత రాజకీయములలో అనుకూల్య మేర్పడగలదు. లేనిచో ప్రజలలో తెగ తెంపులతోకూడిన తీవ్ర భావము లేర్పడుట అసంభవముకాదు.

అసెంబ్లీలో నిర్బంధవిధానచర్చ

(1-వ పేజి తరువాయి)

త్వము వారు ఉపేక్షించుచుండుటయూ, ఆగోపణలను విచారింప నిరాకరించుటయు ఆక్షేపణీయము.

హోం మెంబరు ప్రత్యుత్తరము

చర్చకు ప్రత్యుత్తర మొసంగుచు హోం మెంబరు సర్ రెజినాల్డు మాక్సువెల్ గారిట్లు చెప్పిరి:—

ప్రభుత్వమువారు వ్యక్తులపై గైకొన్న చర్య విషయమై బెనర్జీగారు కొన్ని ఉదాహరణలిచ్చిరి. ఈ చర్యలను రాష్ట్రీయ ప్రభుత్వములవారు తమ అధికారమునుపయోగించి గైకొనుచున్నారు. ఇండియా ప్రభుత్వమువారు కార్యపద్ధతులను మాత్రము నిర్ణయింతురు. ఈకార్య పద్ధతిని అమలుచేయు పని రాష్ట్రీయ ప్రభుత్వములది.

బాధ్యత కాంగ్రెసువారిది

ప్రభుత్వ చర్యవల్ల నిరపరాధులకు నష్టకష్టములు కలిగెననినే నంగీకరింతును. కాని ఈబాధ్యత అల్లరులకు కారణభూతులైనవారిపై యున్నది. అల్లరులుచేయువారు నిరపరాధులకు కలిగించిన నష్టకష్టములను నేను వివరించియే యుంటిని అల్లరుల నడంచుటలో కొంతమంది నిరపరాధులు నష్టపడక తప్పదు. కాని ఈచర్యలు ప్రభుత్వమువారి విధానములో నంతర్భాగమని ఋజువుచేసిన తప్ప, ఈ బాధ్యతను ప్రభుత్వము వారిపై నుట్టవీలు కాదు. ఈ బాధ్యత కయ్యమునకు కాటుప్రవ్వి, దేశములో నిట్టి పరిస్థితు లేర్పడుటకు కారణభూతులైనవారిపైననే కలదు.

పోలీసుల అహింసాత్మక ప్రవర్తన

పిల్లిబారినుండి తప్పించుకొనుటకు ఎలుక పంజుపయోగించుట అహింసయే యని గాంధిమహాత్ముడు చెప్పెను. అరడజెను పోలీసులు వందల కొలది ప్రజలతో కూడిన అల్లరిమూక నెదుర్చునప్పుడు పిల్లి యెవరు ? ఎలుక యెవరు ? పోలీసులు యెలుకవంటివారైనచో, వారే అహింసాత్మకముగా ప్రవర్తించిన వారగుదురు.

దౌర్జన్యమును దౌర్జన్యముతో నెదుర్కొనవలసియున్నది. నేరముల నడంచవలసియున్నది. నేరముల నడంచుటకు ప్రభుత్వము గైకొను చర్యలు 'నిర్బంధ విధాన' మనరాదు. 1932-33 సం॥లో 70 వేల మందిని నిర్బంధించి యుండగా యిప్పుడు జనవరి మధ్యవరకు 30 వేల మంది మాత్రము నిర్బంధింపబడిరి. ఇది అతి తీవ్రమైన నిర్బంధ విధానమని యెవ్వరైన అనగలరా?

ప్రభుత్వమువారి విధానము

భారతదేశము యెడల, మిత్రవుండలివారి యెడల ప్రభుత్వమువారు నిర్వర్తింప వలసిన బాధ్యతలు కలవు. కనుక యుద్ధ నిర్వహణమునకు అంతరాయము కలిగించునట్టియు, శత్రు ప్రతిఘటనకు అంతరాయము కలిగించునట్టి చర్యలను ప్రభుత్వమువారు సాగనివ్వరు. రాజకీయోద్దేశ్యములతో గాని, మరెట్టి యుద్దేశ్యములతో గాని బుద్ధిపూర్వకముగా నిట్టిపనులు చేయుచో, క్రమ పరిపాలనమునకు భంగము కలిగించుచో ప్రభుత్వమువారూరకుండరు. అత్యంత ముఖ్యమగు బాధ్యతలను నిర్వహించుటకు మాత్రమే యిట్టి చర్యలు గైకొనుట ప్రభుత్వమువారి విధానమై యున్నది. వీలైనప్పుడు ఈ నిర్బంధ చర్యలను ప్రభుత్వమువారు ఉపసంహరించుకొన సిద్ధముగా నున్నారనుటకు కాంగ్రెసుల పై నిషేధము, కమ్యూనిస్టు పార్టీలపై నిషేధము తొలగించుటయే నిదర్శనము. సాధారణ సాంఘిక, రాజకీయ కార్యక్రమములు గాని, ప్రజాభిప్రాయ ప్రకటనము గాని నిరోధింపబడి యుండలేదు. యుద్ధ సమయములోనే యిరత నిర్బంధ చర్యలను గూడ ఉపసంహరించుకొన వీలున పరిస్థితు లేర్పడు నని ఆశించుచున్నాను.

యూరోపియను ప్రయాణికుని గడబిడ - అనంతరం

మదరాసు, మార్చి 8:—

గత బుధవారము నాడు సెంట్రలు స్టేషనులైలలో ఒక యూరోపియను ప్రయాణికుడు 1 వ తరగతిలోని డాక్టరు లక్ష్మణస్వామి మొదల్యారుగారి రిజర్వు సీటును ఖాళీచేయక గడబిడ చేసిన యుదంతము గూర్చి, వివరము లిట్లు తెలిసెను. డాక్టరుగారు, పై బల్లమీద పక్కవేసుకొని బండి సాగిపోయినానక, యూరోపియను ప్రయాణికునితో, "ఆరోగ్యము కారణాలచే దిగువ పరుపుమీద పండుకుంటానంటె నేనభ్యంతరము చెప్పక పోదును, కాని ముఖ్యముగా ప్రస్తుతసమయమున ఎవ్వరు న్యాయ విదితమగు నిబంధనలతిక్రమించుట మంచిది కాదు." అని చెప్పినట. కొంచెము మాటలు సాగగ తోడి ప్రయాణికుడు మరొకరు కూడ పాల్గొన్నపిమ్మట, యూరోపియను ప్రయాణికుడు క్షమాపణ చెప్పి, దిగువ పరుపు ఖాళీచేయివ్వగా డా॥ మదల్యారుగారు ఆక్రమించిరి.

గోవాడ పశుప్రదర్శనం

శ్రీ జవ్వాది లక్ష్మయ్యగారి ప్రారంభోపన్యాసము

గోవాడ, మార్చి 6:—

మహాశివరాత్రినాడు గోవాడలో జరిగిన పశు ప్రదర్శనమును శ్రీ జవ్వాది లక్ష్మయ్యగారు ప్రారంభించుచు యొసగిన ఉపన్యాసంలో ముఖ్యభాగాలు ఈదిగువ ప్రకటింపబడినవి.

రైతులు, పశువులు

మనదేశములో రైతుకుగల సంపదలలో పశుసంపద కొప్పది. మనకనాదినుండియువ్యవసాయము సాగించుటలో పశుసంపదమీదనే యాధారపడి యున్నాము. పాడికి పంటకు మనసర్వస్వమునకు పశుజాతియే ఆధారము లగుటచే పశువులు పూజనీయము లైనవి. పశువు బ్రతికియు చచ్చియు దేశోపకారి యగుచున్నది.

పశుగ్రాసము

పూర్వము మనదేశమున, ప్రతి గ్రామమున పశుగ్రాసమునకై పచ్చిక బయళ్లుండెడివి. దాన గోగ్రాసమునకు కొరు వలేకుండా వుండెడిది. నేడట్టివి యే కొలదిగానో జమీందారీ గ్రామములలో కన్పించుచున్నవి. నేడు పశువులకు స్వేచ్ఛగా మేసి సంచరించు భూభాగములు తక్కువ.

కట్టిమేపిన పశువు ఆరోగ్యము నకన్న తిరిగిమేసి యింత పరికు ధ్రుమైన నీరమునుత్రాగి యే చెట్లక్రిందనో విశ్రమించుపశువు ఆరోగ్యము గొప్పది. కాని పచ్చికబయళ్ళు గాని, లంకలుగాని చాల చోట్ల తగ్గిపోయి సాగునిమిత్తమే వుపయోగ పరచుచున్నారు గాని పశువృద్ధికి పశు ఆరోగ్యమును చాల చోట్ల పాటించుటలేదు. మనకు అభిం చు పశువిధములైన మేతలను రైతు జాగ్రతపరచి వాత్సల్యముతో కృతజ్ఞతతో పశువులను పోషించినవాడు పాడిపంటలు సుభిక్షముగా నుండగలవు. దాని నుండే దేశసౌభాగ్యము వృద్ధిగాంచియున్న సంగతి మరువరాని్ది.

ప్రదర్శనముల ఆవశ్యకత

పశు ప్రదర్శనములచే పశుజాతు లెన్ని విధములో, పశుపోషణ యేయేరీతిని చేయుటో, గ్రహించుటకున్ను, మంచిపశువులను తయారుచేయుటకు తగిన ప్రోత్సాహము నందుటకును, పలు మండలములలోని పశుపాలనాపద్ధతు లెఱుంగుటకును, ఒకచోటు నుండి మరియొకచోటునకు మంచిజాతులను కొనిపోవుటకును వలనుపడును.

వైద్యులకు ప్రదర్శనములకు బహుమతులు నిర్ణయించినచో ఉత్తమజాతిపశువులను తయారుచేయుటకు ప్రోత్సాహకరముగా నుండును. రైతున కనేకములగు పశుసంబంధములగు విషయములు గ్రహించి యభివృద్ధికి వచ్చుటకనువగును. వ్యవసాయమును గూర్చిన మంచిచెడ్డలు తెలిసికొనుటకును ప్రభుత్వమును సహాయమునకు త్వరపెట్టుటకును తగిన శక్తివంతమైనదగును.

"ఆంధ్రప్రజ" వారపత్రికపై ఇంజక్షను

నెల్లూరు, మార్చి 8:—

జిల్లా మునసబుకోర్టులో దాఖలుచేయబడ్డ దావా పరిష్కారమయ్యేవరకు శ్రీ కే. శేషారెడ్డిగారిపై గాని, అఖిలభారత సివిలు లిబర్టీస్ యూనియనును లేదా సివిలు లిబర్టీస్ అను వారపత్రికపై గాని ఎలాటి అసత్యవార్తలు నిందారోపణలు ప్రచురించరాదని ఆడిషనలు జిల్లా మునసబు "ఆంధ్రప్రజ" వారపత్రిక సంపాదకునకు తాత్కాలిక ఇంజక్షను ఉత్తరవు జారీచేసెను.

(స్వ. వి.)

యూనియన్ ప్రయాణికుని గడబిడ - అనంతరం

మదరాసు, మార్చి 8:—

గత బుధవారము నాడు సెంట్రలు స్టేషనులైలలో ఒక యూరోపియను ప్రయాణికుడు 1 వ తరగతిలోని డాక్టరు లక్ష్మణస్వామి మొదల్యారుగారి రిజర్వు సీటును ఖాళీచేయక గడబిడ చేసిన యుదంతము గూర్చి, వివరము లిట్లు తెలిసెను. డాక్టరుగారు, పై బల్లమీద పక్కవేసుకొని బండి సాగిపోయినానక, యూరోపియను ప్రయాణికునితో, "ఆరోగ్యము కారణాలచే దిగువ పరుపుమీద పండుకుంటానంటె నేనభ్యంతరము చెప్పక పోదును, కాని ముఖ్యముగా ప్రస్తుతసమయమున ఎవ్వరు న్యాయ విదితమగు నిబంధనలతిక్రమించుట మంచిది కాదు." అని చెప్పినట. కొంచెము మాటలు సాగగ తోడి ప్రయాణికుడు మరొకరు కూడ పాల్గొన్నపిమ్మట, యూరోపియను ప్రయాణికుడు క్షమాపణ చెప్పి, దిగువ పరుపు ఖాళీచేయివ్వగా డా॥ మదల్యారుగారు ఆక్రమించిరి.

మదరాసు ధరలు

వేరుసెనగ

మద్రాసు, మార్చి 9:—

(531 పౌ॥ బా॥ 1-కి ఎక్సు కోస్తాగిడ్డంగులు)		
క్రొత్తరకం మెషిన్‌పప్పు ఆఫీసురకం		80-8-0
,, ,, ,,		
వేరుసెనగనూనె (ఇంగ్లీషుకాండి 500 పౌనులు		
గలది 1-కి వెలచెక్కురకం	170-0-0	
ఎక్సుపెల్లర్	173-0-0	174 0-0
టెంకాయనూనె 38 పౌనులు గల		
డబ్బా 1-కి		18-8-9
ఆముదము (మిల్ డిలివరి) ఎక్సు పెల్లరు		
పర్ ఇంగ్లీషు కాండి 500 పౌ		
నులు గలది 1-వ రకం		205-0-0

చక్కెర

కాన్పూరు	42-1-9	43-11-6

బంగారు వెండి ధరలు

చెన్నపురి, మార్చి 9:—		1-0 గం.
పసరను 1-కి	(టోకు ధర)	48-14-0
పసరను 1-కి	(చిల్లర ధర)	49-0-0
పెట్లా బంగారు	(తులం)	68 2 0
గొట్టు మూసా తులము 1-కి		67 10 0
సీమ్ ఇండి తులము 100-కి (కడి)		105-14-0
వెండి తులం 1-కి		1-1 8

సర్గుల మహిమ

ఈ అద్భుతమయిన పోలాలో మంచి రాబడి మరియు నియమితత, శౌర్య పటుత్వము, అప్యాయతా మును గలిగించును.

దీనివల్లమనుష్యుల ఆదందము, సౌఖ్యము అనుభవింప గలరు.

ఖరీదు రు. 12/- కొద్దుగా ప్లాను లేదు. ఒక వారం భరపు హా. 9/- వంటనే ఆర్డరులు పంపండి.

K. S. Pathi Medical Hall, Palani S. I.

FREE!! Gold Talisman (Govt. Registered) given by a sage in the palace of a Maharaja. Infallibly cures any disease and fulfils all desires. SHAKTI BHANJAR (Estd. 1928) P.-O. Auliabad (Sylhet) Assam.

రసాయనములు

కాస్టిక్‌సోడ, కాస్టిక్‌పొటాష్, బోబాల్టు యాసిటేట్, బోబాల్టులెనో లియేట్ కర్పూరపుపొడుము (జపాన్), కార్బన్ బ్లాక్, పెప్సిన్ మెంటు తైలము, మెంతాల్ క్రిస్టల్, ప్రశస్తమైన కర్పూరతైలము, కర్పూర తైలమండలి మస్టు, క్రియోసోట్ ఆయిల్, టర్కీ ఎర్రతైలం, యానిలిను ఆక్సైడ్, బొరాక్సు, యూసిడ్ యసిటిక్ గ్లేసియల్ 99/100%, ఫార్మలిహైడ్, పోడాయొక్క హైడ్రో సల్ఫయిడ్, పొటాష్ ఐయొడైడ్, పొటాష్ బ్లోరేట్, ఆర్సెనిక్ సూర్యము, కాస్టిక్ సిట్రిక్ యాసిడ్, టార్‌టారిక్ యాసిడ్, జింక్ ఆక్సయిడ్, సోడియంపై క్రేట్ బోరిక్ యాసిడ్, సలిసిలిక్ యాసిడ్, సోడియం సల్ఫేట్, సోడాసలిసిల్సు, పొటాసియం కార్బొనెట్, లెడ్ లెడ్, కార్బలిక్ యాసిడ్ (గ్రువము, క్రిస్టల్) టిటానియం ఆక్సయిడ్, జైంక్ లెడ్ 99/100%, క్విసైన్ సల్ ఫేట్, హైడ్రో సల్ ఫైట్, ఎల్లో క్రిస్టల్ పొటాష్, గ్లిసరిన్, ఆస్పిరిన్, తైమాల్ క్రిస్టల్ మొదలైన అన్ని రకాల రసాయనములకు, "పడ్లాక్" మార్కు, "రెండు గొడ్డళ్ళ" మార్కు ఫినాయిల్‌కు మేము ఇంపోర్టర్లము, స్టాకిస్టులము, డీలర్లము.

SWAIKA CHEMICAL & MINERAL CO., LTD.,
28A, POLLOCK STREET, CALCUTTA.
Phone—Cal, 6171—72 Telegram—"PADLOCK"



రాజా స్నో

సోపు-హేరాయిలు-స్నో

రాజా స్నో అందము నిచ్చును; వెల సీసా రు 1.

రాజా స్నో హేరాయిలు వెంట్రుకలను పెంచును; సీసా 1-కి రు. 1/4/-

రాజా స్నో కస్తూరి సోపు, ఆరోగ్యము, అందము నిచ్చును. బిళ్ల 1-కి అ. 8/-

శిల్పవిద్యనేర్చి ధనార్జన చేయండి.



దేశసంపద పెంపొందించి ప్రజల జీవన ప్రమాణం అభివృద్ధి పరచినట్లయితే దేశకల్యాణం సాధ్యమవుతుంది. భారతయువకులు పూనుకుంటే వారికుటుంబాలకే గాక భారతదేశానికికూడా శుభం చేకూరుతుంది.

ఇండియా ప్రభుత్వం (లేబరుశాఖ) వారి టెక్నికల్-ట్రెయినింగ్ స్కీములో చేరితే మీకిది సులభ సాధ్యమవుతుంది.

ఈప్రక్క జాబితాలోని పనులలో ఏదో ఒకటి నేర్చుకొని, తగిన జీతం సంపాదిస్తూ, సుఖతరమైన జీవనం ఏర్పరచుకొని, ఆర్థికంగానూ పారిశ్రామికంగానూ మన దేశం ఏ ఇతర దేశానికీ తీసి పోకుండా చూడండి. పారిశ్రామికంగా పైకి రావటానికి అవసరమైన సాధన సంపత్తి మనదేశంలో కావలసినంత వున్నది. శిల్ప ప్రవీణులే లేకుండా ఉన్నారు. ఈలోపంతీర్చే అవకాశం మీచేతిలో వున్నది.

శిల్ప విద్య అభ్యసించి టెక్నీషియను కావటానికి సామాన్యంగా చాలా దనమూ కాలమూ వ్యయపరపాలి. కాని ఇండియా ప్రభుత్వం (లేబరుశాఖ) వారి టెక్నికల్ ట్రెయినింగ్ స్కీములోకానీ ఖర్చుకాకుండా, ప్రభుత్వ ఖర్చుతో, అతి శీఘ్ర కాలంలోమీకు విద్య లభిస్తున్నది. పైపెచ్చు, మీరు శిక్షణ పొందినంతకాలమూ మీకు విద్యార్థి వేతనం (స్టయిపెండు) కూడాముట్టుతుంది.

అతిసమర్థులూ, అనుభవజ్ఞులూ అయిన దేశీయ, పాశ్చాత్య నిపుణులు మీకు శిక్షణ ఇస్తారు. మామూలుగా అనేక సంవత్సరాలు పట్టే శిక్షణ కొద్దినెలలలో పూర్తి అవుతుంది.

ఈకొద్ది నెలల శిక్షణతో మీరు శిల్ప ప్రవీణులవుతారు. 4 మాసాలు మొదలుకొని 12 మాసాలలోపుగా మీరు పరీక్షలో నెగ్గగలుగుతారు. పరీక్షలో నెగ్గగానే మీకు దేశంలో వున్న యుద్ధసంబంధమైన ఫాక్టరీలలోగాని మామూలు పరిశ్రమలకు చెందిన ఫాక్టరీలలోగాని మంచి జీతం మీద నౌకరి లభిస్తుంది.

మీలో మరింతనైపుణ్యమూ, పాటు పడే శక్తి ఉన్నట్టయితే మీకు సైనిక శాఖలలో టెక్నీషియనుగా పనిచేసే అవకాశందొరికి మరింత జీతమూ, పైకివచ్చే సదుపాయాలూకలుగుతవి. ఒకవేళ దేశాంతరాలకు పంపడగిన అర్హత మీలో ఉంటే ఇంకా ఎక్కువైన జీతమూ, బత్తెమూ, త్వరగా పైకివచ్చే అవకాశాలూ ఏర్పడుతవి.

పనుల జాబితా

డ్రాఫ్ట్స్‌మెన్ పని	బోయిలరు తయారు చేసే పని
ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ పని	ఎలెక్ట్రో ప్లేటరు పని
రేడియో మెకానిక్ పని	ఎంజిను నడిపే పని
సర్వేయరు పని	గ్రైండరు పని
వైర్లెస్ ఆపరేటరు పని	రంగువేసే పని
ఆర్మేచర్ వైండరు పని	ప్లంబరు పని
బోయిలర్ అటెండెంటు పని	కమ్మరి పని
ఎలెక్ట్రికల్ ఫిటరు పని	పత్రంగపు పని
ఎలెక్ట్రీషియను పని	లైన్స్‌మను పని
మిల్‌రైట్ పని	లోత పని
పేటరన్ మేకరు పని	రివెటరు పని
పనిముట్లు చేసే పని	టర్నరు పని
ఎంజిన్ అర్టిఫిసర్ పని	టెక్స్‌టైల్ ఫిటరు పని
ఫిటర్ పని	తగరము, రాగి పని
మెషీనిస్టు పని	వెల్డరు పని
టర్నరు పని	వైర్మను పని
	ఇటుక పని
	తాపీ పని
	వల్కనిస్టు పని

ఈ అపూర్వమైన అవకాశాన్ని పోగొట్టుకొనక, వెంటనే దరఖాస్తు చేయండి. ఈ క్రింది చిరునామాకు కార్డు వ్రాసినట్టయితే దరఖాస్తుపారమూ, ఇతర వివరాలు లభించగలవు.

ప్రొవిన్షియల్ పబ్లిసిటీ ఆఫీసరు, నెం. 77
టెక్నికల్ ట్రెయినింగ్ స్కీము
సుందర్ మహల్, కిథీడల్ పోస్టు, మదరాసు.

C. P. U. 94 TG

ఇండియా ప్రభుత్వం (లేబరుశాఖ) టెక్నికల్ ట్రెయినింగ్ స్కీము.

గర్భ నివారణము, దంపతి-సుఖ, మరి చేటుండు, నిశ్చింతగా వనిచేయును. శాస్త్రరీతిగా ఆర్డరుకు రు. 4-4-0. తాత్కాలికముగా 6 నూనెలకు రు. 1/4.

బహిష్టు ప్రమాదము, సంభవించిన ప్రసవము. 24 గంటలలో పూర్తి ప్రభావము. వెల రు. 2/5/- అంచెలుగా కూడ పెట్టవచ్చును.

మదనవిలాసము రసాయనాన్ని సేవిస్తే, నరాల బలహీనత గలవారికి కొత్తోత్సాహం పుట్టి, అందమైన దేహం సమకూరుతుంది. వెల రు 2/- పోస్టేజి అ. 9

రిటర్నబుల్ మార్కు కరపత్రమును పంపుదుము.

బాబులు యింస్టిటుటో వారాయుర్వేదము.

KAVIRAJ M. KAVYATIRTHA (Jalpalguri)
Branch:70, CORNWALLIS ST, Calcutta

జోసోజం ఈస్టు

1. జోసో - కుల విజయం సమస్యలకు అమోఘం రు. 1
2. జోసో-నోట్సు (లు) ఇంగ్లీషులోనికి రు. 1
3. జోసో-పిల్లలకు ఆరోగ్యం గురించి క్లుప్తముగా అ. 6

మీ సమీపమందు దొరకకపోతే మాకు వ్రాయండి.

జోసోకెమికల్సు కాకినాడ.

స్త్రీలకు ఆరోగ్యమును సౌఖ్యజీవనమును

పుట్టు నొప్పి, క్రమము తప్పు బహిష్టు అరుపు, తెలుపు, ఎరుపు, హిస్టీరియా నివారణ అగుటకు

శాంతిఅశోక

శాంతిపటేరం, తణుకు పో॥ గో॥ జిల్లా.
సోల్ ఏజంట్సు:
శ్రీ కృష్ణా జనరల్ స్టోర్సు, తణుకు.

ఉచితము

పెట్టుబడేమీ లేకుండానే, మీకు తీరికగా నున్నప్పుడు పనిచేసి సులభంగా రోజుకు రూ॥ 10 లు సంపాదించుకోగలరు. రహస్య మేమీ లేదు. వేళకొద్దీ లాభం పొందారు. కాంటిల్సుకోసం వ్రాసుకొనండి. పూర్తివివరాలు ఉచితము. F(2-82)

AMERICAN N. G. COMPANY,
Post Box No. 61 (A. P. M.) Lahore (India)

గుడివాడలో అరెస్టులు

గ్రామాధికారిని బంధించిరని ముద్దాయిలపై నేరారోపణ

గుడివాడ, మార్చి 6:—

గుడివాడ పోలీసు ఇన్స్పెక్టరు గారు గురువారం వారి పర్యటనలో 10 మంది యువకులను 56 ఇండియా రక్షణచట్టము క్రింద అరెస్టుచేసి తీసుకొనివచ్చిరి.

జమీందారులు వేపల్లి, తిరువూరు, పోలిశెట్టి పల్లి గ్రామములందు కాంగ్రెసు జండా పుచ్చుకొని వైదులను శిస్తులు కట్టవద్దని యాందోళనకారు వ్యతిరేకమైన నినాదములు చేసినందు నేరము నేరము మీరిపై మోపబడెను. ఇవిగాక మీరు మరుమారు గ్రామ సువసలను బంధించి చేతులు కట్టి కాంగ్రెసు పతాకమును మిమ్మల్ని అరెస్టుచేయనని ఉత్తరు విచ్చినదని చెప్పి, ఆయనను నిర్బంధించిరనికూడా కేసు మోపబడెను. మీరి పేర్లు మరునూరి సూర్యప్రకాశరావు, కె. నాగేశ్వరరావు, దాసు రామస్వామి, సుమ్మల చెల్లయ్య, లింగం లక్ష్మీనారాయణ, రావూరి అర్జునరావు, చేతంపూడి వెంకటసుబ్బయ్య, బోడా తాతయ్య, ఎమ్. నాగయ్య, అప్పిరట్ల జోసెఫ్. (ప్ర. వి.)

చీరాలలో ఆహారపదార్థముల సమస్య

చీరాల, మార్చి 6:—

ఈ వూరిలో అన్ని ఆహారపదార్థములకు వంటచెఱకుకు ధరలు పెరిగి బీదలకు చాలా ఇబ్బందిగా యున్నది. పంచదార చీరాల పేరాలలో ఎక్కడా స్టాకులేదు. ఎక్కడైనా కొద్దిగాయున్నా చాలా విపరీతధరకు అమ్ముచున్నారు. యిటీవల ఈ రేషనుకు దినుసు తియైన ఆస్ట్రేలియా గోధుమలు ఈ జిల్లాకు కొన్ని బస్తాలు వచ్చినవి. అందుకు ఈ వూరికి 8 బస్తాలు జిల్లాకలెక్టరుగారు మంజూరు చేసినారు. తెల్లకాగితములు దొరకడములేదు. అగ్గిపెట్టెల సంగతికూడా అట్లే యున్నది. బియ్యం ధరకూడ పెరిగిపోయినది. (స్వ. వి.)

ఆ. భా. పశు ప్రదర్శనం

బెజవాడలో 10, 11 వ తేదీలలో జరుగును

బెజవాడ, మార్చి 6:—

ఆరవ అఖిల భారత పశుప్రదర్శనము మార్చి 10, 11 వ తేదీలందు బెజవాడలో పశువుల ఆసుపత్రి ప్రక్కనున్న ఖాళీ స్థలమునందు జరుపబడును. అఖిల భారత పశువుల ప్రదర్శనము ఆంధ్రదేశమునందు జరుగుట కిదియే ప్రప్రథమము. ఆంధ్రదేశములో నిపశు సంపదను వృద్ధి చేయుట, పశుపెంపకములోని అనుభవమునకు ఒకరినొకరు తెలిసికొనుట, ఈ ప్రదర్శనము యేర్పాటు చేయుటలో ముఖ్యోద్దేశములు. ప్రదర్శనమునకు వచ్చిన మంచి పశువులకు బహుమతు లీయబడును. యెక్కువగా పాలనిచ్చు ఆవులకు, గేదలకుకూడా బహుమానము లీయబడును. సుమారు ఆరు వందల పశువులు ఆంధ్రదేశమంతటనుండి ప్రదర్శనమునకు వచ్చుచున్నట్లు తెలియుచున్నది.

దున్నుటయందును బరువు లాగుటయందును పోటీలు యేర్పాటుచేయబడినవి.

రకరకముల యెద్దులు, ఆవులు, గేదెలు ప్రదర్శనమునకు వచ్చునని తెలియుచున్నది. (ప్ర. వి.)

గుంటూరుజిల్లా రైతుసంఘం

తెనాలి, మార్చి 7:—

గుంటూరుజిల్లా రైతుసంఘ నూతన ఎన్నికలు జరిగి ఈ క్రిందివారు నూతన కార్యకర్తలుగా ఎన్నుకోబడిరి:— అధ్యక్షులు శ్రీ కొల్లా వెంకయ్యగారు. ఉపాధ్యక్షులు శ్రీ రావి చినమ్మయ్యగారు, ప్రధానకార్యదర్శి కనగాల కుటుంబరావు, సహాయకార్యదర్శులు శ్రీ అన్నె సీతారామయ్య, శ్రీ నేలకుదటి నాగేశ్వరరావు. సభ్యులు—యలవర్తి వెంకటనాయుడు, పొన్నపల్లి లక్ష్మీనారాయణ, వలిశెటి నరసింహారావు, మూదేకుల ఖాశింసాహెబు, వావిలాల గోపాలకృష్ణయ్య, మోరం అమరారెడ్డి, కరణం రంగారావు, టి. కోటీశ్వరరావుగార్లు. (స్వ. వి.)

నంద్యాలలో రేషనింగుకై ఏర్పాటులు

నంద్యాల, మార్చి 4:—

ఆహార పదార్థములను ప్రజలకు సరఫరా జేయుటకుగాను ప్రభుత్వమువారి వుత్తర్వుల ననుసరించి యిచటి జనసంఖ్య వివరములను మునిసిపల్ కమీషనరుగారు తయారు జేయించుచున్నారు. మునిసిపల్ ఎలిమెంటరీ స్కూళ్ల వుపాధ్యాయులు యీ విషయమున తోడ్పడుచున్నారు. (స్వ. వి.)

శ్రీ పాముల వెంకయ్యగారు

దుగ్గిరాల లాకులకు బదిలి

బాపట్ల, మార్చి 7:—

బాపట్లలో పి. డబ్లియు. శాఖలో టెలిఫోను సూపర్వైజరుగా పనిచేయుచున్న పాముల (బొడ్డుపల్లి) వెంకయ్యగారు బాపట్ల సబ్ డివిజను ఆఫీసునుండి దుగ్గిరాల లాకులకు మార్చబడిరి. అన్ని గ్రామములవారి కోరికననుసరించి బాపట్ల సబ్ డివిజనులోని అన్ని టెలిఫోనులకు కూడలియగు దుగ్గిరాలకు శ్రీ పాముల వెంకయ్యగారిని ట్రాన్సుఫరుచేసి ప్రజల కృతజ్ఞతకు శ్రీయుత యగ్జిక్యూటివ్ ఇంజనీయరుగారు పాత్రులైరి. టెలిఫోను ఖర్చులు లేక ఉచితముగ ఆయా ప్రాంతీయ ప్రజలు హానికరమగు పాముకాటుల గురించి టెలిఫోను ద్వారా ఎప్పుడు అవసరమైన అప్పుడు తెలియపరచి పాముకాటు మంత్రము వేయించుకొనవచ్చును. (స్వ. వి.)

పెద్దాపురం మునిసిపలు చేర్మెను ఎన్నిక

మార్చి 6:— ఈ సాయంకాలము స్థానిక డిప్యుటీ కలెక్టరుగారి అధ్యక్షతను మునిసిపల్ కవున్సిలర్లు ప్రమాణములు తీసికొనిరి. తరువాత శ్రీ ముప్పన చిన అంకయ్యగారు, (శిల్కు ఫ్యాక్టరీ ప్రొప్రయిటరు, చెవుపవాడ ఎస్టేటు జమీందారు) ఏకగ్రీవముగా చైర్మెన్‌గా ఎన్నుకోబడిరి. (స్వ. వి.)

ద. భా. లాన్ టెన్నిసు పందెములు

మచిలీపట్నం, మార్చి 8:—

దక్షిణభారత లాన్ టెన్నిసు చాంపియన్‌షిప్పు పందెములు స్థానిక లన్సులో బాక్సెటు టోర్నమెంటు 6-4; 4-6; 9-7; 7-5 సెట్టులతోనూ, బి. ఆర్. కాపినపతి శివస్వామిని 8-6; 6-1; 6-4 సెట్టులతోను ఓడించిరి.

అనంతపురానికి గోధుమలు

అనంతపురం, మార్చి 7:—

అనంతపురంజిల్లానుండి బెల్లము, మెరపకాయలు, చింతపండు మొదలగునవి కలెక్టరుగారి ఉత్తరువు పొందనిదే జిల్లా దాటి ఎగుమతి చేయకుండా కొన్నాళ్లక్రింద జిల్లా కలెక్టరుగారు నిషేధించిరి. చింతపండు' బెల్లం మొదలగు వాటి ధరలు కొన్నాళ్ల క్రింద విపరీతంగా పెరుగు సూచనలుండెను. కాని ఇప్పుడు కొంతవరకు తగ్గినది.

ఈ జిల్లాకు నాలుగునూర్ల మూటలు గోధుమలు తెప్పింపబడినవి. జిల్లాఅంతటా పంచిపెట్ట బడునని తెలిసినది. (స్వ. వి.)

డిప్టీ॥ కే॥ సి. విజయరాఘవనుగారు

కడప, మార్చి 7:—

ప్రొహిబిషన్ శాఖకు చేరిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగారైన శ్రీ సి. విజయరాఘవన్ గారు మెదడుకు సంబంధించిన వ్యాధిచే గవర్నమెంటు ఆస్పత్రిలో మృత్యువువాత పడిరని తెలుపుట కెంతయు చింతిల్లుచున్నాను. (స్వ. వి.)

సంపాదక లేఖలు:

ఆంధ్రరాష్ట్రం ఎందుకు?

ఆంధ్రపత్రికా సంపాదకులకు,

ఆర్యా! మదరాసులో పలువురు అరవ మిత్రులును "సగం ఆంధ్రు"లను మిత్రులును "ప్రత్యేకాంధ్రరాష్ట్రం ఎందుకూ? అని కొందరు ఎగతాళిగనూ, కొందరు నిజంగా కారణం తెలియకనూ అడుగుచుందురు. అట్టి వారికి జవాబుగ యీ దిగువ విషయం మీ పత్రికద్వారా తెలుపగోరెదను.

గడచిన శనివారంనాడు మదరాసు ప్రభుత్వంవారు 8 ఇరిగేషను స్కీములు "సస్యాభివృద్ధి" కార్యక్రమాన్ని ప్రకటించేరు. అన్నిస్కీములకు ఖర్చు మొత్తము రూ॥ 4 లక్షల 90 వేలు. ఇందులో రెండు మాత్రమే తంజావూరు, తిరుచునాపల్లి జిల్లాలకు చెందినవిన్నీ, తక్కిన ఆరు నెల్లూరు దత్తమండలములలో కొన్ని జిల్లాలకు సంబంధించినవి. ఇది చూచి ఆంధ్ర జిల్లాలకే ఎక్కువ లాభం చేస్తున్నట్లు పైకి కనబడక మానదు. కాని వివరాలు పరికించినచో!

ఆరవ జిల్లాలలోని రెండు ఇరిగేషను స్కీములకు మొత్తము రూ॥ 2,45,000 తెలుగు జిల్లాలలోని ఆరు స్కీములకు రూ॥ 1,45,000 ఖర్చుకాగలదు. తిరుచునాపల్లి తంజావూరు జిల్లాలలో దత్తమండలాలలో కన్న పంటలు తక్కువగ నుండబట్టి గాబోలును, సస్యాభివృద్ధి విధానం ప్రకారం యీ పెద్ద ఇరిగేషను స్కీములన, అన్నివిధాల ఆర్థిక ఒత్తిడి ఎక్కువగ నున్న యీ కాలంలో ప్రభుత్వంవారు మంజూరు చేసిరి.

కడ్డించేవాడు మనవాడైతే కడపంత్రిని కూడున్నా ఫరనాలేదట. ఇట్లాంటి అన్యాయాలు జరుగకుండా యుండుటకే ఆంధ్రరాష్ట్రం కోరడ మని వేరే చెప్పాలా?

విజయ

ఆంధ్రదేశ వార్తలు

చీరాల

మార్చి 5:—నిన్న సాయంకాలము ఈ వూరిలోని శ్రీ గోపాలకృష్ణటాకీస్ యొక్క తృతీయ వార్షికోత్సవము శ్రీయుత రావుల లోకనాథం పంతులుగారి అధ్యక్షతను జరుపబడెను. (స్వ. వి.)

ఖమ్మం మెట్ట

మార్చి 6:—స్థానిక శ్రీ విజ్ఞాన నికేతన వార్షికోత్సవము ది 18, 19 మార్చి తేదీలలో శ్రీ సురవరపు ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతను జరుగును. (స్వ. వి.)

రాజమండ్రి

మార్చి 7:—ఈరోజున స్థానిక సహకార సంఘ మహాసభ బ్యాంకు ఆవరణలో జరిగెను. ఈ సంఘ సమావేశమున పాలకవర్గ ఎన్నికలు జరిగినవి. శ్రీ దాసరి సత్యనారాయణగారు అధ్యక్షులు గాను, మద్దూరి శివరామకృష్ణయ్యగారు కార్యదర్శిగాను ఎన్నుకొనబడిరి. (స్వ. వి.)

తెనాలి

మార్చి 8:— తెనాలిలో ఆర్యవైశ్య కుటుంబమునకు చెందిన శ్రీ తెలప్రోలుసుబ్బారావుగారికిని జాగర్లమూడి కాపురస్థులు శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారికిని నిన్నటి సాయంకాలం కమ్యూనిస్టు పాడి కార్యాలయంలో శ్రీ చదలవాడ పిచ్చయ్యగారి అధ్యక్షతను నవీనపద్ధతులతో వివాహము జరిగినది. (స్వ. వి.)

కడప

మార్చి 7:—దత్తమండల ఆర్థిక సంఘ సభ్యులును, బెరైటీసుగనుల సొంతదారులను, గొప్ప ధనవంతులును అగు శ్రీ ఏ. కృష్ణప్పగారు వారి ద్వితీయకొమారులు శ్రీ ఏ. లక్ష్మయ్యగారి వివాహ సందర్భములో మొన్నటిదినము వారి కర్మాగారమువద్ద 6000 మంది బీదలకు అన్నదానము చేసిరి. (స్వ. వి.)

నౌపాడ

మార్చి 6:—5-వ తేదీన నౌపాడా ఆంధ్ర గ్రంథాలయ భవనమున శ్రీ న్యాయపతి నారాయణరావుగారి అధ్యక్షతను, నౌపాడా ఆంధ్ర గ్రంథాలయ ఆరవ వార్షికోత్సవము జయప్రదముగా జరిగెను. సభను శ్రీ శెట్టి ఈశ్వరరావుగారు ప్రారంభించిరి. శ్రీ దేవరాజు వెంకటకృష్ణరావుగారు, డి. యస్. రెడ్డిగారు, సీతాపతిగారూ, మొదలగువారు గ్రంథాలయాభివృద్ధిని గూర్చి మాట్లాడిరి. (ఒ. వి.)

చిన్నగంజాం

చీరాల, మార్చి 5:—

ఈ సంవత్సరం చిన్నగంజాంలో శ్రీ బాలకోటీశ్వరస్వామివారి ఆలయమువద్ద మహాశివరాత్రి వుత్సవము జరిగినది. ఆవూరిలో చిందునాట్యము జరుగగూడదని చీరాల సబ్ మేజస్ట్రేటుగారు క్రి. ప్రొ. కో 144 సెక్షన్ క్రింద ఉత్తరువులు గావించిరి. చీరాల పోలీసువారు మేజస్ట్రేటుగారు అక్కడే మకాంచేసి తగుబందోబస్తు గావించిరి. వచ్చిన యాత్రికులందరికి ధర్మకర్త మద్దికర నారాయణరావుపంతులుగారు సతీసమేతముగా సపర్యలను గావించిరి. (స్వ. వి.)

గుంటూరు

మార్చి 7:—ఆంధ్ర క్రైస్తవ కళాశాల పాతవిద్యార్థుల దినము నిన్న సాయంకాలము ఆంధ్రక్రైస్తవ కళాశాల నూతన భవనములో శ్రీయుత అబ్దుల్ సత్తార్ బి. ఏ. బి. యల్. సబ్ జడ్జి (పాత విద్యార్థి) అధ్యక్షతక్రింద జరుపబడెను. శ్రీయుతులు ప్రథల రామబ్రహ్మం, మాధవపెద్ది హనుమంతరావుగార్లు (వకీలులు) పాత విద్యార్థుల, కళాశాల అభ్యుదయమును గూర్చి మాట్లాడిరి. కళాశాల ప్రిన్సిపాలు డాక్టర్ సైఫ్సుగారు, కళాశాల తరపున మాట్లాడిరి. సభకు పూర్వము టీపార్టీ జరుపబడెను. (స్వ. వి.)

నంద్యాల

మార్చి 4:—గత రెండుసంవత్సరములకు పైగా యీపురపాలక సంఘమునకు కమీషనరుగా యున్న శ్రీయుత హైదర్లీ ఖాన్‌గారిని హిందూపురం పురపాలకసంఘమునకు ప్రభుత్వమువారు బదిలీజేసియున్నారు. శ్రీయుత డి. సి. బి. వెంకట్రావుగారిని యీ పురపాలకసంఘమునకు కమీషనరుగా నియమించియున్నారు.

యీచట జిల్లా మునసబుగాయుండిన శ్రీయుత యం. ఈశోకుగారిని విశాఖపట్నంజిల్లా చోడవరం కు మార్చి అచట జిల్లా మునసబుగాయున్న శ్రీయుత డి. గోవిందరాజులునాయుడుగారిని యిచటికి బదిలీజేసియున్నారు. (స్వ. వి.)

వెలంపేటలో జంతు బలి ఆపబడుట

విశాఖపట్నము, మార్చి 6:—

విశాఖపట్టణ ప్రేమ సమాజమువారి కోరికపై వెలంపేట పెద్దలు ప్రేమ పూర్వకముగా ఏకీభవించి 5-3-48 తేది శుక్రవారము వెలంపేట కనకదుర్గాలమ్మ జాతరలో జంతుబలులు పూర్తిగా ఆపి అమ్మవారిని ఫలపుష్పాదులతో పూజలు గావించిరి. గత 3 సంవత్సరములనుండి వెలంపేటలో జంతుబలులు ఆగినవి. (ఒ. వి.)

THE BOMBAY MUTUAL LIFE ASSURANCE SOCIETY Ltd.

బాంబే మ్యూచుయల్ లైఫ్ అష్యూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

(స్థాపితము 1871.)

భారతదేశమున అనాదిగానున్న గొప్ప మ్యూచుయల్ లైఫ్ ఆఫీసు.

గత 71 సం॥ నుండి భారతదేశమునకు సేవచేయుచున్నది

హెడ్ ఆఫీసు:
బాంబే మ్యూచుయల్ బిల్డింగు, ఫోర్టు, బొంబాయి.

సరసమైన షరతులకు ఏజంట్లు కావలెను.

ఈదిగువ అడ్రసుకు దరఖాస్తులను పంపుడు:
యస్. వి. రామస్వామి అండ్ బ్రదర్సు, మదరాసు రాజధాని, తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానములకు చీఫ్ ఏజంట్లు:
సేలం.

రక్త-దోషాంతక్

(రిజిష్టర్డు)

రక్త-దోషాంతకము రక్తమును పరిశుభ్రపర్చుటలో ప్రశస్తమైనది. కొరుకుడు రోగమునకు అద్భుతమైనది. మచ్చలు, పురాణగజ్జి, తామర, కురుపులు, మొదలగు చర్మవ్యాధులను మాన్పును. అది ఆకలిని పెంచి, జీర్ణశక్తిని వృద్ధిచేసి, బలవర్ధకౌషధంగా పనిచేస్తుంది. స్త్రీల కుసుమలకు దివ్యౌషధం.

సౌందర్యము వరప్రసాదమే, కాని రక్త-దోషాంతకాన్ని వాడి చర్మాన్ని అందంగా మచ్చలు లేకుండా చేసుకోవచ్చును. అది రక్తాన్ని శుభ్రపర్చి, చర్మవ్యాధులను, వ్యాధులయొక్క మూలాన్ని నాశనం చేస్తుంది.

ప్యాకెట్లు: 6 ఔన్సులు, 16 ఔన్సులు.

DECCAN AYURVEDASHRAM PHARMACY LTD. (Reg'd)
హెడ్డాఫీసు: హైదరాబాదు, డక్కన్.
ప్రొపోర్టర్లు: ఆయుర్వేదాశ్రమ ఫార్మసీ లిమిటెడ్., అహ్మదీనగరం.

సామాన్య రుగ్మతలు నెం. 3



ఇవి కారణములు కావచ్చును.

సాధారణంగా అతి శీఘ్రంగా అర్పుకపోయే శీతలము కారణంగా రొమ్ము పడిశము ఆరంభం అౌతుంది. శ్లేష్మం చిక్కనై జిగట యేర్పడి శ్వాసనాళముయొక్క లోభాగాలకు అంటుకొంటుంది: తరుచు దాదయెక్కువ కావడానికిని యీర్పునకును యిది కారణం అౌతుంది. ఈ శ్లేష్మంలోపుండే ఆ రుగ్మతసంబంధమైన క్రిములు దాదను పెంచుతవి. శ్లేష్మం అంతా పూర్తిగా బయట పడిపోయి నప్పుడే ఆది తగ్గుతుంది.

చికిత్స: రికాల్విన్ వెంటనే శాంతినిస్తుంది. ఒగర్పు దగ్గును యిది విధిగా పోగొడుతుంది. గుణముగల దేశీయమూలికల ద్రవరూపమైన సత్తువతో, అధునికరసాయనములు శాస్త్రీయపద్ధతులలో మిశ్రమము చేయబడినది రికాల్విన్. ఇది పాషాణముచేర్పియు, చేర్పకయు తయారు చేయబడినది. సోమరి లేక సల్ఫార్సమిడ్ యింజక్షనులు యివ్వబడిన సందర్భములలో పాషాణముచేర్చని రికాల్విన్ యివ్వడము మామూలు. ఐనాముందుగా వైద్యుని అభిప్రాయం తెలిసికోవలెనని మాసలహా.

రికాల్విన్, జిగురు ఎక్కువైన శ్లేష్మాన్ని వలచబరచి యీర్పును నిర్మూలిస్తుంది. శ్వాసనాళములలోని పొరలలో క్రిములు పెరుగకుండా చేస్తుంది.

స్టాండర్డ్ ఫార్మసూటికల్ వర్క్సు లిమిటెడ్
కలకత్తా

SPK 3. TG.

సిటీ స్టాకిస్టులు:— మెసర్సు ఏ. ఎస్. నాయగర్ అండు కో, 2 సుబ్రహ్మణ్య సంధు, రత్తకజారు పి. టి. మద్రాసు.

'ఆస్ప్రో'
'సీల్‌టైట్' ప్యాక్‌సు

ఇండియాలోని కోట్లకొలది ప్రజలు ప్రశంసించుచున్నారు

ఆధునికకాలపు బ్రహ్మాండమయిన వైద్య పరిశోధన ప్రతి కుటుంబమునకును ఎట్లు ఉపయోగపడును.

"ఆస్ప్రో" నిరపాయకరమయినట్టియు, శీఘ్రముగా గుణమునిచ్చునట్టియు; ఔషధమని ఇండియా అంతటను ప్రశంసింపబడినది. ఇది హృదయమునకుగాని కడుపునకుగాని హానిచేయదు. "ఆస్ప్రో" ఆరోగ్యకరమయిన "సీల్‌టైట్" ప్యాక్‌లో విడివిడి అరలలో ప్యాక్‌చేయబడినది. "ఆస్ప్రో" యొక్క "సీల్‌టైట్" ప్యాక్ దానికి చెమ్మ, తడి తగలకుండచేయును; అందువలన మీరు ప్యాకెటు చించువరకు అందులోని ఔషధగుణము పూర్తిగా అట్లే నిలిచియుండును. విడిగావున్న బిళ్ళలలో ఔషధగుణముపోయి మీ దేహతత్వమునకు అపాయము కలిగించవచ్చును. "సీల్‌టైట్" ప్యాక్‌లో ప్యాక్ చేయబడిన "ఆస్ప్రో" బిళ్ళలు మీకు తాజాగా శుద్ధముగాచేరును; అవి తయారగునప్పుడు యెక్కడనుకూడ చేతితో తాకబడవు. వ్యాధి నివారణలో ఉత్తమమయినట్టియు, జ్వరమును తగ్గించునట్టియు, నొప్పిని నిలుపగలశక్తి సదా కలిగినట్టియు 3 బిళ్ళలు మీకు 1 అణాకు లభించును.

ఆస్ప్రో మలేరియా జ్వరమును రూపుమాపును; పోట్లను నొప్పులను శీఘ్రముగా నిలిపివేయును.

2 బిళ్ళలు మలేరియాను పోగొట్టును.
2 బిళ్లలు తలనొప్పులను 5 నిమిషములలో నివారించును.
2 బిళ్ళలు జ్వరమును 10 నిమిషములలో తగ్గించును.
2 బిళ్ళలు పండ్లపోటును పార్శ్వపునొప్పిని తక్షణము అపును.
2 బిళ్ళలు నరములనొప్పిని అప్పుడే పోగొట్టును.
2 బిళ్ళలు మీకు హాయిఅయిన నిద్రనొసగును.
2 బిళ్ళలు స్త్రీల ఋతుశూలలను నివారించును.
2 బిళ్ళలను పుక్కిలించిన, గొంతునొప్పులను హాయిచేయును.
2-3 బిళ్ళలు పడినెయునుగాని, ఇన్ఫ్లుయెంజానుగాని హతమార్చును.
2-4 బిళ్ళలు కీళ్లనొప్పులను, నరములచుంటలను, కీళ్ళచుంటలను పోగొట్టును.

వెల—3 బిళ్ళలు అ 1. 30 బిళ్ళలు అ 10. అన్నిచోట్లను అమ్మబడును.

గొంతునొప్పులకు "ఆస్ప్రో"ను గంధూషముగా తీసుకొనుడు.

మోతాదులు: 1 బిళ్ళ 8 యేండ్లు పైబడ్డపిల్లలకు. ½ బిళ్ళ 3 మొదలు 6 ఏండ్లలోపు పిల్లలకు. పసిబిడ్డకూడ "ఆస్ప్రో"ను నిర్భయముగా సేవించవచ్చును.

డిస్ట్రిబ్యూటర్సు:—జె యల్ మారిసన్, సన్ అండ్ జాన్స్ (ఇండియా) లిమిటెడ్.
పో. బా. 258, బొంబాయి—ఫోను 30958 (బ్రాంచి ఆఫీసులున్ను) B110-TG

ఆస్ప్రో గుండెకుగాని కడుపుకుగాని హానిచేయదు